

భళా యోగేశ్వరి

మూడేళ్ల వయసులోనే విభిన్నమైన ఆసనాలు వేస్తూ.. అందరినీ అబ్బురపరుస్తూ.. తన పేరును సార్థకం చేసుకుంది రెడ్డి యోగేశ్వరి. ద్వారకాతిరుమలలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నూజివీడుకు చెందిన ఈ చిన్నారి వేసిన యోగాసనాలు చూపరులను మంత్ర ముగ్ధులను చేశాయి. తల్లి యోగా ట్రైనర్ కావడంతో ఆమెను చూసి ఈ చిన్నారి కూడా రోజూ ఇంటిలో ఆసనాలు వేయడం మొదలుపెట్టింది. గురువారం పలు రకాల ఆసనాలు వేస్తూ అందరిని అలరించింది.

యోగా జీవనశైలిలో భాగం కావాలి : కలెక్టర్

ద్వారకాతిరుమల, మే 29(ఆంధ్రజ్యోతి): జీవనశైలిలో యోగాను ఓ భాగంగా చేసుకుని ప్రతీ ఒక్కరూ మానసిక, శారీరక ధృడత్వాన్ని పెంపొందించుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి కోరారు. ద్వారకాతిరుమలలోని హరిత హోటల్ ఆవరణలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో జేసీ ధాత్రిరెడ్డి, ఆర్డీవో రమణలతో కలసి పాల్గొని యోగాసనాలను వేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వెయ్యిమందికి పైగా యోగా ట్రైనర్‌లను గుర్తించామని, వారితో జిల్లావ్యాప్తంగా వచ్చేనెల 21వరకు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో యోగాపై అవగాహన కల్పిస్తారన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని, పర్యాటక అభివృద్ధి అధికారి పట్టాభిరామయ్య, తహసీల్దారు సుబ్బారావు, యోగా శిక్షకులు విజయలక్ష్మి, శివ, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమలలో యోగాసనంలో కలెక్టర్, జేసీ తదితరులు

ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణాన్ని పెంచాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాయని, జిల్లాలో రైతులు సాగు విస్తీర్ణాన్ని మరింతగా పెంచేలా వ్యవసాయాధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. ద్వారకాతిరుమల, గుండుగొలనుకుంట, సూర్యచంద్రరావుపేట తదితర గ్రామాల్లో గురువారం ఆమె పర్యటించి వ్యవసాయ అనుబంధ రంగాల సాగు పద్ధతులను పరిశీలించారు. వ్యవసాయశాఖ జేడీ హబీబ్ బాషా, డ్వామా పీడీ సుబ్బారావు, ఎంపీడీవో ప్రకాశ్ పాల్గొన్నారు.

106 మందికి హెచ్‌ఎంల పదోన్నతి కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌లో డీఈవో ఎదుట ధ్రువీకరణ పత్రాలపై సంతకాలు చేస్తున్న హెచ్‌ఎం

ఏలూరు అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ అసిస్టెంట్ కేడర్ నుంచి గ్రేడ్-2 హెచ్‌ఎం పదోన్నతికి గురువారం రాత్రి స్థానిక సిద్ధార్థ స్కూలులో కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లో మొత్తం 106 వెకెన్సీల భర్తీని అర్హులైన వారికి పదోన్నతి ద్వారా పూర్తి చేశారు. సీనియార్టీ ప్రకారం ఉమ్మడి పశ్చిమలో పనిచేస్తున్న 282 మంది స్కూల్ అసిస్టెంట్లను కౌన్సెలింగ్‌కు పిలిచారు. వీరిలో పదోన్నతికి ఆసక్తి వున్న వారి నుంచి ఆప్షన్లు తీసుకుని ఆయా స్థానాలను కేటాయించారు. హెచ్‌ఎం విధుల్లో చేరాల్సిన తేదీని పాఠశాల విద్య కమిషనరేట్ నుంచి సమాచారం పంపారని విద్యాశాఖాధికారులు వివరించారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీవైఈవోలు, ఎంఈవోలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్పౌజ్ కోటాపై దుమారం

ఇప్పటికే ముగిసిన గ్రేడ్-2 హెచ్‌ఎం సాధారణ బదిలీల కౌన్సెలింగ్‌లో స్పౌజ్ కోటాలో దరఖాస్తు చేసిన కొందరు నిబంధనలకు విరుద్ధంగా వెకెన్సీలను ఖరారు చేసుకుని నిబంధనల ఉల్లంఘనకు పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు డివిజన్‌కు సంబంధించి కొందరు స్పౌజ్‌కు సమీపంగా క్లియర్ వెకెన్సీలు ఉన్నప్పటికీ కోరుకోకుండా భాగస్వామికి దూరంగా స్థానాలకు ఆప్షన్లు ఇవ్వడమే కాకుండా బదిలీ ఉత్తర్వులు పొందారని తెలుస్తోంది. ఈ విషయం డీఈవో వెంకటలక్ష్మమ్మకు తెలియడంతో అప్రమత్తమయ్యారు. స్పౌజ్ పనిచేస్తున్న ప్రాంతానికి మాత్రమే తొలుత ఆప్షన్లు ఇవ్వాలని, ఆ తర్వాత స్పౌజ్ పనిచేస్తున్న మండలం, తర్వాత డివిజన్.. ఇలా వరుసక్రమంలో వెబ్ ఆప్షన్లు ఇవ్వాలన్నారు. స్పౌజ్ పోస్టు జోనల్ లేదా రాష్ట్రస్థాయిలో ఉంటే అటువంటివారు జిల్లాలో ఎక్కడైనా వెకెన్సీలకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని రూలింగ్ ఇచ్చారు. నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే తదుపరి ఇబ్బందులు ఎదుర్కొవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఐటీడీఏ టీచర్లకు నేడు బదిలీ కౌన్సెలింగ్

బుట్టాయగూడెం, మే 29 (ఆంధ్రజ్యోతి) : కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు శుక్రవారం బదిలీ కౌన్సెలింగ్ జరగనుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు సీనియారిటీ జాబితాను కేఆర్‌పురం కార్యాలయం నోటీస్ బోర్డులో, డీవైఈవో వాట్సాప్ గ్రూపులో గురువారం ఉంచినట్టు పీవో కె.రాములు నాయక్ తెలిపారు. దీనిపై అభ్యంతరాలుంటే ఉపాధ్యాయ సంఘాలతో జరిగే సమన్వయ సమావేశంలో చర్చిస్తామన్నారు. అలాగే వార్డెన్లు, బోధనేతర సిబ్బంది, నాల్గవ తరగతి సిబ్బందికి ఈనెల 30న బదిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

రేపటి నుంచి 'పది' సప్లిమెంటరీ మూల్యాంకనం

ఏలూరు అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ముగియడంతో జవాబుపత్రాల మూల్యాంకనంపై జిల్లా విద్యాశాఖ దృష్టి సారించింది. వివిధ జిల్లాల నుంచి మొత్తం 18 వేల జవాబు పత్రాలను అన్ని సబ్జెక్టుల నుంచి మూల్యాంకనం నిమిత్తం జిల్లాకు కేటాయించారు. ఈనెల 31నుంచి జూన్ 2వ తేదీ వరకు ఏలూరు సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో మూల్యాంకనాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. జవాబు పత్రాలను దిద్దడానికి అసిస్టెంట్ ఎగ్జామినర్లు 306 మందిని, చీఫ్ ఎగ్జామినర్లు 50 మందిని, 100 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు.

ఏలూరు కాలువను ఏం చేస్తారు ?



కాలువలో పేరుకుపోయిన తూడు, చెత్త

చెత్తా చెదారంతో మురుగు కాలువగా మార్చేశారు

- ఆధునికీకరణకు కావాల్సింది కోట్లు.. ఇచ్చింది రూ.20 లక్షలు
- ఈ సొమ్ముతో పనులు చేసేదెలా ? తూడు తొలగించేదెలా ?
- నాలుగు నియోజకవర్గాల పరిధి.. లక్షన్నర ఎకరాల ఆయకట్టు
- అయినా చిన్నచూపుపై రైతుల అసహనం.. అధికారుల నిస్సహాయత

(తాడేపల్లిగూడెం అర్బన్-ఆంధ్రజ్యోతి):

పశ్చిమ డెల్టాలో ఏలూరు పంట కాలువ నిరాదరణకు గురవుతోంది. ఆధునికీకరణ విషయంలోనూ ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయి. కాలువకు అనుకుని వున్న పట్టణాలు, పల్లెల నుంచి మురుగు నీరు కాలువలో చేరుతోంది. పంట కాలువ కాలుష్య కాసారంగా మారుతోంది. అదే నీటిని శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు జిల్లా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నా ఫలితం ఉండటం లేదు. నిధుల కొరత వెంటాడుతోంది. ప్రస్తుత వేసవిలోనూ కాలువ మరమ్మతుల కోసం రూ.20 లక్షలు మాత్రమే మంజూరుచేశారు. ఏలూరు కాలువ పరిధిలో నాలుగు నియోజకవర్గాలు విస్తరించాయి. నలుగురు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అందరూ కూటమి ప్రభుత్వానికి చెందినవారే. అయినా సరే నిధుల విషయంలో వారి ప్రయత్నాలు ఫలించలేదు. ఏలూరు కాలువ కోసం ప్రత్యేకంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గ పరిధిలోనే రూ.3 కోట్ల విలువైన ప్రతిపాదనలు పంపారు. పూడికతీత, గట్టు పటిష్టత, పరిశుభ్రత, రివైట్‌మెంట్ వాల్ నిర్మాణ పనులను ప్రతిపాదించారు. వాస్తవానికి పశ్చిమ డెల్టాలో పంట కాలువలు, మురుగు కాలువల మరమ్మతుల కోసం రూ.40 కోట్లు కేటాయించారు. అయినా ఏలూరు కాలువ మొత్తానికి రూ.20 లక్షలు మాత్రమే మంజూరయ్యాయి. సదరు నిధులతో పూడికతీత పనులు నిర్వహించలేమని ప్రజా ప్రతినిధులు, అధికారులు తేల్చి చెబుతున్నారు. కాలువ మట్టి తొలగించేందుకు దాతలను సమీకరిస్తున్నారు.



ఏలూరు కాలువలో కలుస్తున్న మురుగునీరు

గతమెంతో ఘనం

ఏలూరు పంట కాలువకు ఎంతో ఘనచరిత్ర ఉంది. బ్రిటీష్ కాలం నుంచి జలా రవాణా కోసం ఏలూరు కాలువను ఉపయోగించేవారు. అప్పట్లో బకింగ్ హం కాలువగా దీనిని పిలిచేవారు. ఇదే కాలువను మళ్లీ జల రవాణా కోసం ఇటీవల ప్రతిపాదనలు చేసింది. దాదాపు రూ.మూడు వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. సర్వేలు జలరవాణాకు ఆమోదయోగ్యం కాదంటూ ఈ ప్రాజెక్టును విరమించుకున్నారు. జల రవాణా ఉన్నప్పుడు తాడేపల్లిగూడెం పశ్చిమ గోదావరి జిల్లాకు పెద్ద మార్కెట్‌గా ఉండేది. జిల్లా నుంచి రైతులంతా సరుకుల విక్రయించేందుకు ఇక్కడ మార్కెట్‌పైనే ఆధారపడేవారు. ఇంతటి ఘనచరిత్ర వున్న ఏలూరు కాలువ నిరాదరణకు గురికావడం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. జిల్లాలో అత్యధిక సాగు భూమి ఏలూరు కాలువ పరిధిలోనే ఉంది. దాదాపు 1.50 లక్షల ఎకరాల పంట భూమి ఏలూరు కాలువ పరిధిలో సాగు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కాలువను పూర్తిగా విస్మరిస్తోంది. పశ్చిమ డెల్టా ఆధునికీకరణ కోసం 2008లో రూ.1,400 కోట్లు కేటాయించారు. తొలి దశలో రూ.800 కోట్లతో పనులు ప్రారంభించారు. ఏలూరు (మిగతా 8వపేజీలో)

కాలువలోనే చెత్త

ఏలూరు కాలువ విజ్జేశ్వరంలో ప్రారంభమై ఏలూరు కృష్ణా కెనాల్‌లో కలుస్తుంది. 90 కిలోమీటర్ల విస్తీర్ణం. నిడదవోలు, తాడేపల్లిగూడెం రూరల్, పెంటపాడు, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు మండలాలను కలుపుతూ వెళుతుంది. తాడేపల్లిగూడెం మున్సిపాలిటీతోపాటు నిడదవోలు, తాడేపల్లిగూడెం రూరల్, ఉంగుటూరు, భీమడోలు మండలాల ఎన్నో గ్రామాలు ఉన్నాయి. చెత్తతోపాటు నిర్మాణాల వ్యర్థాలను గట్లపై వేస్తున్నారు. అవి చివరకు కాలువలోకి జారిపోతున్నాయి. రేవుల వద్ద కాలువలో దిగాలంటేనే మోకాలిలోతు బురద. పూడిక తీయకపోవడంతో రేవులు నిరుపయోగంగా మారుతున్నాయి. తాగునీటి సరఫరాలోనూ ఇబ్బంది ఎదురవుతోంది.



హోం ఐసోలేషన్‌లో బాధితుడికి చికిత్స

ముసునూరు/తణుకు రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి):ముసునూరు మండలం యల్లాపురంలో కరోనా పాజిటివ్ కేసు నమోదు కావడంతో బాధితుడిని హోం ఐసోలేషన్‌లో ఉంచి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఓ వ్యక్తి(52) ఇటీవల హైదరాబాద్‌లో తన బంధువుల ఇంటికి వెళ్లి వచ్చాడు. అనంతరం అతను జలుబు, తీవ్ర దగ్గుతో రావడంతో బుధవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లాడు. వైద్యులు శాంపిల్స్ తీసి పరీక్షించగా పాజిటివ్ వచ్చింది. దీంతో ఇంటి వద్దనే ఉంచి వైద్య సేవలందిస్తున్నారు. ముసునూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి షీకీనా ఇవాంజలి గురువారం బాధితుడి ఆరోగ్యాన్ని పరిశీలించారు. కుటుంబసభ్యుల నుంచి కొవిడ్ శాంపిల్స్‌ను సేకరించారు. బాధితుడి ఇంటి పరిసరాల్లో శానిటేషన్ చేయించారు.

కరోనా పరీక్షల రిపోర్టులు తెలియకుండా జనాన్ని భయపెట్టవద్దని తణుకు మండలం వేల్పూరు ప్రాథమిక వైద్య కేంద్రం వైద్యుడు డాక్టర్ కేఎంఆర్ కిశోర్ పేర్కొన్నారు. జలుబు, దగ్గుతో బాధపడే వ్యక్తులకు రాపిడ్ టెస్టులు చేస్తే సాధారణంగా పాజిటివ్‌గానే రిపోర్టులు వస్తాయని, కరోనా వీఆర్‌డీఎల్ నమూనా పరీక్షలో తెలుస్తుందన్నారు.

ఏజెన్సీలో విష జ్వరాల విజృంభణ

బుట్టాయగూడెం : పశ్చిమ ఏజెన్సీలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఆసుపత్రులకు జ్వరాలతో వస్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉన్న దొరమామిడి, పులిరాముడుగూడెం, అంతర్వేదిగూడెం పీహెచ్‌సీలతోపాటు ఇతర ప్రాంతాల్లోని ఆసుపత్రుల వద్ద జ్వరాలతో బాధపడుతున్న జనాలు అధికంగా కనిపిస్తున్నారు. 'వర్షాలు ప్రారంభం కావడంతో సీజనల్, విష జ్వరాలు, మలేరియా జ్వరాలు పెరుగుతున్నాయి. జ్వరాల అదుపునకు సిబ్బందితో ఇంటింటా ఫీవర్ సర్వే చేయిస్తున్నాం. వైద్య సేవలు అందించేందుకు వైద్యులు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు' అంటూ డిప్యూటీ డీఎంహెచ్‌వో జె.సురేష్‌కుమార్ తెలిపారు.

చర్యలు తప్పవు..!

'పది' మూల్యాంకనం లోపాల బాధ్యులకు జరిమానా ?

- తప్పులకు అనేక కారణాలను విశ్లేషిస్తున్న ఉపాధ్యాయులు
- ఏదైనా.. పిల్లల జీవితాలతో ఆటలాడారంటున్న తల్లిదండ్రులు



ఏలూరు అర్బన్, మే 29(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిని గుర్తించి వారికి జరిమానా విధించాలని విద్యాశాఖ అధికారులు ఓ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. వాస్తవానికి ఈ పద్ధతి ఇంటర్మీడియట్ బోర్డులో ఇప్పటికే అమలవుతోంది. ఈ ఏడాది మార్చిలో జరిగిన టెన్త్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలు ఏప్రిల్‌లో విడుదల చేశారు. జిల్లాలో పరీక్షలు రాసిన విద్యార్థుల ఏడు సబ్జెక్టుల జవాబుపత్రాలు రాష్ట్రంలో ఏడు జిల్లాలకు మూల్యాంకనం నిమిత్తం వెళ్లాయి. ఫలితాల్లో తమకు మార్కులు తక్కువ వచ్చాయంటూ కొందరు, పలు ప్రశ్నలకు జవాబులను ఖచ్చితంగా రాసినా అసలు మూల్యాంకనమే చేయకుండా వదిలేశారని కొందరు విద్యార్థులు రీకౌంటింగ్/రీవెరిఫికేషన్ నిమిత్తం నిర్ణీత రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. వీరు ఉమ్మడి జిల్లాలో రెండు వేల మంది వరకు ఉన్నట్టు సమాచారం. దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంలో ప్రభుత్వ పరీక్షల విభాగానికి పంపడం వల్ల ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారన్న దానిపై స్పష్టతలేదు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల జవాబు పత్రాలను పంపించారు. ఆ ప్రకారం రీకౌంటింగ్/రీవెరిఫికేషన్‌లో మార్కుల్లో మార్పులు వచ్చిన సందర్భంలో సంబంధిత జవాబుపత్రాన్ని మూల్యాంకనం చేసిన సిబ్బందిని గుర్తించి వాల్యుయేషన్ చేయడంలో నిర్లక్ష్యం, తప్పిదానికి బాధ్యులుగా చేస్తూ జరిమానా విధించే అవకాశం ఉంది. ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు అందిన జవాబుపత్రాల మూల్యాంకనంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారి పేర్లతో కూడిన సిబ్బంది జాబితాను డీజీఈ(ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్) త్వరలో జిల్లాకు పంపించనున్నట్టు సమాచారం. సంబంధిత సిబ్బందిపై తదుపరి చర్యలకు పాఠశాల విద్య కమిషనరేట్‌కు నివేదించనున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న టీచర్ల బదిలీల ప్రక్రియ ముగిసిన తర్వాత దీనిపై చర్యలు చేపడతారని సమాచారం.

ఒత్తిడి వల్లే తప్పిదాలు ?

ఇంటర్మీడియట్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనానికి ఒక్కొక్క అసిస్టెంట్ ఎగ్జామినర్/ఎగ్జామినర్ రోజుకు 30 ఆన్సర్ స్క్రిప్టులను దిద్దుతున్నారు. పదో తరగతి మూల్యాంకనానికి వచ్చేసరికి రోజుకు 40 స్క్రిప్టులను దిద్దాలని మార్గదర్శకాలున్నాయి. అయితే రికార్డు సమయంలో వాల్యుయేషన్‌ను పూర్తి చేయించాలన్న పట్టుదలతో రోజుకు ఒకొక్కరితో 50 స్క్రిప్టుల వరకు దిద్దించడం వల్లే లోపాలు తలెత్తడానికి కారణమైందని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. దీనికితోడు గతేడాది మూల్యాంకనానికి వ్యవధి తొమ్మిది రోజులు ఇవ్వగా, ఈ ఏడాది ఆరు రోజులకే పరిమితం చేయడం, ఆన్సర్ స్క్రిప్టులను పెంచేయడం, వాటి సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని పెంచకపోవడం అసిస్టెంట్ ఎగ్జామినర్లపై తీవ్ర ఒత్తిడి పడి జవాబుపత్రాలను ఆదరాబాదరగా దిద్దడానికి కారణమైంది. ఇంటర్, టెన్త్ మూల్యాంకనాలకు చెల్లిస్తోన్న రెమ్యునరేషన్‌లోను భారీ వ్యత్యాసం కూడా ఒక కారణంగా కాదనలేమని ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మూడేళ్లుగా పదో తరగతి మూల్యాంకనం విధులు నిర్వర్తించిన సిబ్బందికి ఇంత వరకు టీఏ, డీఏలు చెల్లించకపోవడాన్ని గుర్తుచేస్తున్నారు. కారణాలు ఏమైనా పిల్లల జీవితాలతో ఆటలాడారని తల్లిదండ్రులు వాపోతున్నారు. వారు చేసిన తప్పులకు తాము మానసికంగా, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయామని మండిపడుతున్నారు.

ఏలూరు ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ శశిధర్



ఏలూరు క్రైం, మే 29(ఆంధ్రజ్యోతి):ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎం.శశిధర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితోపాటు ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి పూలమొక్కను అందించి అభినందించారు. సూపరింటెండెంట్ ఎఎస్ రాజు వ్యక్తిగత కారణాలతో దీర్ఘకాలిక సెలవులో వెళ్లడంతో అప్పటి నుంచి ఇన్‌చార్జులుగా వివిధ వైద్యులు కొనసాగారు. కొద్ది రోజులుగా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి ఇన్‌చార్జిగా బాధ్యతలు కొనసాగిస్తున్నారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మైక్రో బయోలజీ హెచ్‌వోడీగా పనిచేస్తున్న డాక్టర్ శశిధర్ గతంలోను సూపరింటెండెంట్‌గా పనిచేశారు.

మండు వేసవిలో వర్షాలు

ఏలూరు సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ప్రధానంగా రోహిణి కార్తెలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రోహిణి కార్తెలో ఎండలకు రోళ్లు బద్దలవుతాయని పెద్దలు చెబుతుంటారు. అయితే ఈ ఏడాది వాతావరణంలో మార్పులు కారణంగా రోహిణి కార్తెలోను జిల్లా వ్యాప్తంగా మబ్బుల వాతావరణం, చాలా ప్రాంతాలలో వర్షాలు కురుస్తున్నాయి. మరో పక్క నైరుతి రుతుపవనాలు వచ్చేస్తున్నాయనే సంకేతాలు రావడంతో ఈ ఏడాది ఇరవై రోజుల ముందుగానే వాన ముసురు ప్రారంభవుతుందని చెబుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, అల్పపీడన ద్రోణి కారణంగా నాలుగు రోజులుగా జిల్లాలో వర్షాల జోరు పెరిగింది. పగటి ఉష్ణోగ్రతలు 35 నుంచి 36 డిగ్రీల సెంటీగ్రేడ్ మాత్రమే నమోదవుతున్నాయి. దీంతో వాతావరణం చల్లబడింది. జిల్లాలో గడచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా చాట్రాయి మండలంలో 13.4 మిల్లీ మీటర్లు, లింగపాలెం 9.2, బుట్టాయిగూడెం 6.6, పెదవేగి 4.8, దెందులూరు 3.2, వేలేరుపాడు 1.4, పెదపాడు 0.4, జీలుగుమిల్లి, నిడమర్రు మండలాల్లో 0.2 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

అనుమతుల మాటున..!

- అధికారుల అండతో నిబంధనల అతిక్రమణ
- నూజివీడు నియోజకవర్గంలో అక్రమార్కుల మట్టిదందా

నూజివీడు, మే 29 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ, గృహ అవసరాలకు మట్టి తోలకాలు చేపడుతూ చెరువులో పూడిక తీయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోకు అక్రమార్కులు కొత్త భాష్యం చెబుతున్నారు. అధికారుల అండతో అనుమతుల మాటున నిబంధనలను అతిక్రమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో మట్టి తోలకాలను తమ ఆర్థిక వనరుగా మార్చుకునేందుకు రంగం సిద్ధం చేసినట్టు తెలిసింది. ఈ మేరకు మట్టి తోలకాలకు ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లను సిద్ధం చేయడం గమనార్హం. చిన్న, పేద, మధ్య తరగతి వర్గాలు తమ ఇంటి అవసరాలకు మట్టి తోలుకునేందుకు సవాలక్ష అనుమతులు కావాలని చెప్పే అధికారులు అక్రమార్కులకు ప్రభుత్వ జీవోల పేరిట యథేశ్చగా అనుమతులు ఇవ్వడం విశేషం.

నిబంధనలు ఇలా..

- చెరువులలో మట్టి తొలకాలకు సంబంధించి ఇరిగేషన్ అధికారుల నుంచి (మిగతా 8వ పేజీలో)



గుళ్ళపూడిలో మట్టి తవ్వకాలు

గుళ్ళపూడిలో చెరువులో మట్టి తవ్వకాలు

ముసునూరు : గుళ్ళపూడి ఊరచెరువులో గురువారం అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని తహసీల్దార్, వీఆర్వో, ఇరిగేషన్ ఏఈలకు ఫిర్యాదు చేసిన స్పందన లేదని స్థానిక టీడీపీ నాయకులు బోగోలు సత్యనారాయణ, నెక్కలంటి రాజేశ్, వేంపాటి చైతన్య ఆరోపించారు. అనుమతులు ఉన్నాయంటూ కొంతమంది అధికార పార్టీ నాయకుల అండదండలతో యథేచ్ఛగా ఉదయం నుంచి అక్రమంగా మట్టిని తవ్వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ విజయ్‌ను వివరణ కోరగా ఊర చెరువుల్లో మట్టి తవ్వకాలకు అనుమతి ఇంకా ఇవ్వలేదని, ఫైల్ ఉన్నతాధికారుల వద్దే ఉందన్నారు. అయితే గుళ్ళపూడి చెరువులో మట్టి తోలుకునేందుకు అనుమతులు ఇచ్చినట్టు తెలిపారు.




సభలో అమ్మాయిల ఉత్సాహం


మహానాడు వేదిక


సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు



మహా జాతర







కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం





అమ్మవారి గరగలను గరగల గుడి తీసుకువెళ్తున్న దృశ్యం

మావుళ్ళమ్మ జ్యేష్టమాస జాతర ప్రారంభం

భీమవరం టౌన్ మే 29(ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ జ్యేష్టమాస జాతర గురువారం సాయంత్రం వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారి ఆలయ మండపంలో అమ్మవారి గరగలకు అమ్మవారి అత్తంటివారు, పుట్టింటివారి అల్లూరి, మెంటే వారి కుటుంబ సభ్యులు చేత ఆలయ ప్రధానార్చకుడు మదిరాల మల్లిఖార్జునశర్మ పూజలు చేయించి అమ్మవారిని నిలబెట్టారు. అనంతరం గరగలను వే దమంత్రాలు, మేళతాళాలతో ఆలయ నుంచి నరహరిశెట్టివారి వీధిలో ఉన్న అమ్మవారి గరగల గుడికి తీసుకువెళ్ళారు. పొట్టి శ్రీరాములు విగ్రహం, భీమేశ్వరస్వామి ఆలయం మీదుగా చేరుకుంది. ఆసందర్భంలో అమ్మవారికి మహిళలు వారుపోసి పూజలు చేసుకున్నారు. ఈకార్యక్రమాన్ని ఆలయ సహాయ కమిషనర్ బుద్దా మహాలక్ష్మి నగేష్ పర్యవేక్షణలో నిర్వహించారు.

నేత్రపర్వం.....శివదేవుని కల్యాణం


ద్వారకాతిరుమలలో శివదేవునికి కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల, మే 29 (ఆంధ్రజ్యోతి): క్షేత్రపాలకునిగా విరాజిల్లు తోన్న శివదేవుని ఆలయ ంలో స్వామివారి కల్యాణం గురువారం నేత్రపర్వ ంగా జరిగింది. లోకకల్యా ణార్ధం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ కల్యాణ తంతు భక్తులను అలరించింది. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయ ముఖమండపంలో ఏర్పాటు చేసిన వేదికపై గంగా,పార్వతీ సమేత శివయ్య కల్యాణ మూర్తులను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం కల్యాణతంతును ప్రారంభించారు. శుభముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర బెల్లం ధరింపజేసి మాంగల్య ధారణ, తలంబ్రాలు మేళతాళాలు, డోలు,సన్నాయి వాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు.

వచ్చే నెలలో డీసీసీబీ, ఆప్కాబ్ చైర్మన్‌గా గన్ని బాధ్యతలు



ఏలూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): ఏలూరుజిల్లా డీసీసీబీ చైర్మన్‌గా, ఆప్కాబ్ చైర్మన్‌గా గన్ని వీరాంజ నేయులు అధికారికంగా నియమితులయ్యారు. డీసీసీబీ చైర్మన్‌గా జూన్ 26న, ఆప్కాబ్ చైర్మన్‌గా జూలై 27న బాధ్యతలు స్వీకరిస్తారు. డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా జేసి ధాత్రిరెడ్డి, ఆప్కాబ్ చైర్మన్‌గా త్రినాథ్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు.

సొసైటీలు ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్స్ దాఖలు చేయాలి

- ఐటీశాఖ జాయింట్ కమిషనర్ ప్రతాప్‌సింగ్


ఏలూరు వర్క్‌షాపులో మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ ప్రతాప్‌సింగ్.. పాల్గొన్న కార్యదర్శులు

ఏలూరు, మే 29(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలు సేవా సంఘాలుగా పనిచేస్తున్నప్పటికీ ఆదాయపు పన్నుశాఖకు రిటర్న్స్ తప్పనిసరిగా దాఖలు చేయాలని ఆదాయపు పన్నుశాఖ జాయింట్ కమిషనర్ (రాజమహేంద్రవరం) ప్రతాప్‌సింగ్ భుక్యా అన్నారు. ఏలూరు డీసీఎంఎస్ గ్రాండ్ కన్వెషన్ హాల్లో జిల్లా కో-ఆపరేటివ్ సొసైటీ సంఘాల కార్యదర్శులు, పర్సన్ ఇన్‌చార్జిలకు ఐటీ రిటర్నులు దాఖలపై ఒక రోజు అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 155 సంఘాలు పూర్తిస్థాయిలో కంప్యూటీకరణ జరగడం శుభ పరిణామమన్నారు. ఆదాయపు పన్ను లాగిన్ ద్వారానే ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేయాలని, మాన్యువల్‌కు అవకాశం లేదన్నారు. పాతపద్ధతులకు స్వస్తి చెప్పాలని స్పష్టం చేశారు. కో-ఆపరేటివ్ సహకార సంఘాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు పొందాలంటే ఆదాయపు పన్ను శాఖకు రిటర్న్ దాఖలు చేసి ఎటువంటి పెండింగ్‌లు, బకాయిలు లేకుండా చూసు కోవాల్సిన బాధ్యత సంఘాలదేనన్నారు. సహ కార సంఘాల మంచి ఆడిటర్‌ను నియమించుకోవాలని సూచించారు. ఆదాయపు పన్నుశాఖ నుంచి నోటీసులు వస్తే వెనువెంటనే ఆడిటర్‌ను సంప్రదించాలన్నారు. అశ్రద్ధ చేస్తే ఎన్నో ఇబ్బందులు కలుగుతాయన్నారు. జిల్లా సహకారశాఖ అధికారి ఆరిమిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ కో-ఆపరేటివ్ సహకార సంఘాలు ఆదాయపుపన్ను రిటర్నులు దాఖలు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఏలూరు ఐటీ శాఖాధికారి షేక్ అబ్దుల్ ఖయాం, డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి పి.త్రినాథ్, ఆడిటరు ఆర్.రాధాకృష్ణ, కార్యదర్శులు, పర్సన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఉచిత కార్పొరేట్ విద్యకు స్ర్కీనింగ్ టెస్టు నోటిఫికేషన్

ఏలూరు అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ-సి కేటగిరీలకు చెందిన టెన్త్ ఉత్తీర్ణులకు ఇంటర్మీడియట్, జేఈఈ ఇంజనీరింగ్, తదితర ఉన్నత విద్యా కోర్సులను కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఉచితంగా అందించేందుకు అర్హులైన వారిని ఎంపిక చేయడానికి ఏటా నిర్వహించే స్ర్కీనింగ్ టెస్టుకు స్పృహ ఎడ్యుకేషనల్ ఎంపవర్‌మెంట్ ట్రస్టు గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ట్రస్టు ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా విద్యాకార్యక్రమాలను పాఠశాల విద్య అడిషనల్ డైరెక్టర్ (గవర్నమెంట్ టెక్స్‌బుక్స్) డి. మధుసూదనరావు నేతృత్వంలోని ఉపాధ్యాయ బృందం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని ఐదు జిల్లాల్లో నిర్వహిస్తున్న విషయం విదితమే. పదో తరగతి పరీక్షల్లో కనీసం 550మార్కులకు పైబడి వచ్చి, నిర్ణీత కేటగిరీలకు చెందిన బాల బాలికలు జూన్ 21న నిర్వహించనున్న స్ర్కీనింగ్ టెస్టుకు దరఖాస్తు చేసుకోవాలని, అర్హత సాధించిన వారిని కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్, జేఈఈ చదివేందుకయ్యే అన్ని ఖర్చులను ట్రస్టు భరిస్తుందని ట్రస్టు జిల్లా ప్రతినిధి, జిల్లావిద్యాశాఖ డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వర రావు తెలిపారు. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సీటు సాధించలేకపోయిన విద్యార్థులు లాంగ్‌టెర్మ్ కోచింగ్ తీసుకునేందుకు కూడా స్ర్కీనింగ్ టెస్టుకు హాజరు కావచ్చని, ఎంపికైన వారికి కోచింగ్ పూర్తయ్యే వరకు ఖర్చులను ట్రస్టు భరిస్తుందన్నారు. స్ర్కీనింగ్ టెస్టు ఉభయ గోదావరి జిల్లాలకు సంబంధించి రాజమహేంద్రవరంలోని తిరుమల ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్‌లో జూన్ 21న ఉదయం పది గంటలకు జరుగుతుందన్నారు. వివరాలకు 79816 96481, 93900 59900, 99595 07507 నంబర్లలో సంప్రదించాలన్నారు.

'6.5 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం'

పెదవేగి, మే 29(ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపు లక్ష్యంగా 3ఎఫ్ ఆయిల్‌పామ్ ప్రైవేట్ లిమిటెడ్ పనిచేస్తోందని 3ఎఫ్ సంస్థ హెడ్ కిలారి శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాలోని 50 గ్రామాల్లో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించడానికి అనువుగా సదస్సులు నిర్వహించడానికి చర్యలు చేపట్టామన్నారు. అయిల్‌పామ్ సాగులో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 1.5 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని, ఇది దేశంలో 60 శాతంగా ఉందని చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ఆఖరునాటికి ఆయిల్‌పామ్ సాగు మరింతగా పెంచడానికి అనువుగా చర్యలు తీసుకున్నామన్నారు. 2025-26 నాటికి అదనంగా మరో 6.5 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు విస్తరించడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. ప్రస్తుతం దేశీయ అవసరాలకోసం దిగుమతులపైనే ఆధారపడి ఉన్నామని, ఏటా 130 లక్షల టన్నులకు మించి దిగుమతులు ఉన్నాయని, దీంతో విదేశీ మారక ద్రవ్య నిల్వలు తగ్గిపోతున్నాయన్నారు. దీన్ని అధిగమించాలంటే ఆయిల్‌పామ్‌సాగు విస్తీర్ణం పెంపు ఒక్కటే మార్గమని తెలిపారు. భారత ప్రభుత్వం ఆయిల్‌పామ్ విస్తీర్ణం పెంపు లక్ష్యంగా ఈ మిషన్ పనిచేస్తోందని వివరించారు.

వీఆర్‌వోల బదిలీలపై స్పష్టత ఇవ్వండి

- రాష్ట్ర సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు


భూపతిరాజు రవీంద్రరాజు

ఏలూరు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ అధికారుల బదిలీలకు సంబంధించి స్పష్టత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇటీవల బదిలీలకు సంబంధించి ప్రతీశాఖకు లైన్ డిపార్ట్మెంట్ ద్వారా మార్గదర్శకాలు ఇచ్చారన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి సీసీఎల్‌ఏ గైడ్‌లైన్స్ ఇచ్చారన్నారు. ఆ ప్రకారం బదిలీలు జరుగుతాయని అనుకుంటున్న సమయంలో మంత్రి డోలా వీరాంజనేయులు సచివాలయాల రేషనలైజేషన్ ప్రక్రియ కారణంగా సచివాలయ సిబ్బందికి బదిలీలు జరగవని చెప్పారన్నారు. ఇప్పటివరకు గ్రామ, వార్డు, సచివాలయాల శాఖ ద్వారా ఎటువంటి ఆదేశాలు ఇవ్వకపోవడంతో రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న గ్రేడ్ 1, గ్రేడ్ 2, వీఆర్వోలకు బదిలీల్లో అవకాశం లేదని ఒక్కో జిల్లాలో ఒక్కొక్క రకంగా అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బదిలీలకు సంబంధించి సమయం ముగుస్తున్నందున గ్రామ, వార్డు సచివాయలయాలతో సంబంధం లేకుండా గ్రామ రెవెన్యూ అధికారులకు బదిలీలలో అవకాశం కల్పించాలని కోరారు.

తెలుగు సినీ రంగానికి పెద్దన్న దాసరి

నేడు వర్ధంతి


దాసరి దంపతులు

పాలకొల్లు అర్బన్, మే 29(ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ రంగంలో పెద్దన్న మాదిరిగా దాసరి నారాయణరావు గుర్తింపు పొందారు. దర్శకుడిగా, నిర్మాతగా, కళాకారుడిగా, రాజకీయ నాయకుడిగా దాసరి తనదైనశైలి ముద్ర వేసుకున్నారు. సినీ రంగానికి సంబంధించి ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరించారు. పాలకొల్లుకు చెందిన దాసరి నారాయణరావు 1917వ సంవత్సరం మే 30వ తేదీన మృతి చెందారు. ఈ మేరకు శుక్రవారం దాసరి వర్థంతి సందర్భంగా ఆయన గురించి కొన్ని విషయాలు..


పాలకొల్లులో దాసరి కాంస్య విగ్రహం

పాలకొల్లు ముద్దుబిడ్డ దాసరి నారాయణ రావు 1947 మే నెల 4వ తేదీన జన్మించారు. ప్రాథమిక విద్యను, కళాశాల విద్యను పాలకొల్లులోనే చదివారు. బీఏ పూర్తి అయిన తరువాత కళారంగంపై ఆసక్తితో మద్రాసుకు వెళ్ళి సినీ ప్రరిశ్రమలో ప్రవేశించారు. రచయితగా, దర్శకునిగా, నటుడిగా, రాజకీయ నాయకుడిగా పాలకొల్లుకు మంచి పేరు తీసుకువచ్చారు. అంతే కాకుండా సినిమా మాటల రచయితగా 2450 చిత్రాలకు సంభాషణలు రాయడంతో పాటు 150 చిత్రాలకు దర్శకత్వం వహించి గిన్నీస్‌బుక్ రికార్డు సాధించారు. 50చిత్రాలను స్వయంగా నిర్మించారు. నటుడిగా తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో నటించి తన ప్రతిభను చాటారు. 1983లో పట్టణంలో దాసరి దాతృత్వంతో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరి రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా కొనసాగిన సమయంలో పట్టణ నడిబొడ్డులో గాంధీ బొమ్మల సెంటర్ వద్ద నరసాపురం ప్రధాన పంట కాలువపై కాలిబాట వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో ఆ వంతెనకు దాసరి పేరు పెట్టారు. పట్టణానికి చెందిన ఎందరినో మద్రాసుకు (చెన్నై) తీసుకువెళ్ళి సినీ రంగానికి పరిచయం చేసి వారి అభ్యున్నతికి కృషి చేశారు. పాలకొల్లులో దాసరి కల్చరల్ అసోసియేషన్ పేరుతో కొన్ని ఏళ్ళు జాతీయ స్థాయి నాటికల పోటీలు నిర్వహించారు. ఎంతో పేరు ఉన్న లీలామ హాల్ థియేటర్‌ను కొనుగోలుచేసి దాసరి సినిమాహాల్‌గా మార్పు చేసి కొన్ని ఏళ్ళు నడిపారు. దాసరి నారాయణ రావు భార్య పేరు పద్మ, కుమా రులు ప్రభు, అరుణ్ కుమార్.

- తొలి చిత్రం తాతామనవడుతో ప్రారంభించి స్వర్గం నరకం, తూర్పు పడమర, మేఘ సందేశం, ప్రేమాభిషేకం, మనుష్యులంతా ఒక్కటే, బొబ్బిలిపులి, సర్ధార్ పాపారాయుడు, మామగారు, ఒసేయ్ రాములమ్మ, సూరిగాడు వంటి చిత్రాలు ఎన్నో మరపురాని చిత్రాలు దాసరి చరిత్ర పుటల్లో నిలిచి పోయాయి. ఆనాటి అగ్రహీరోలందరితోనూ పలు విజయవంతమైన చిత్రాలను తీసిన ఘనత దాసరికి దక్కుతుంది. 2017 మే 30వ తేదీన తన 70 వ ఏట అనారోగ్య కారణాలతో హైదరాబాద్‌లో తుది శ్వాస విడిచారు.



వికసిత సంకల్ప అభియాన్ సభలో మాట్లాడుతున్న వీసీ గోపాల్

రైతులకు వనరులు సమకూర్చేందుకు
వికసిత కృషి సంకల్ప అభియాన్

తాడేపల్లిగూడెం రూరల్, మే29 (ఆంధ్రజ్యోతి): రైతులకు క్షేత్రస్థాయిలో వనరులు సమకూర్చేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తుందని వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ వీసీ కె.గోపాల్ అన్నారు. పట్టింపాలెంలో ఉద్యాన విశ్వవిద్యాలయం, కేవికే ఆధ్వర్యంలో కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. వీసీ గోపాల్ మాట్లాడుతూ జూన్ 12 వరకూ పట్టింపాలెంలో వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, తదితర శాఖల శాస్త్రవేత్తలు రైతులతో చర్చిస్తారన్నారు. రైతులకు సూచనలు సలహాలతోపాటు రైతుల అవసరాలు ప్రభుత్వానికి నివేదించే అవకాశం ఉందన్నారు. ఐసీఏఆర్ డైరెక్టర్ ఎం.శేషమాధవ్ మాట్లాడుతూ 15 రోజుల పాటు శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు ఉపయుక్తమైన ప్రయోగ ఫలాలు వారికి అందిస్తారన్నారు. పరిశోధనా సంచాలకులు కేటీవీ.రమణ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు గడించే విధంగా శాస్త్రవేత్తల పరిశోధనలు రైతులకు అందించగలరన్నారు. మత్స్యశాఖ జిల్లా అధికారి కె నరసయ్య మాట్లాడుతూ వ్యవసాయంలో భాగంగానే చేపల పెంపకం ఉందని ప్రస్తుతం జిల్లాలో చేపల పెంపకం భారీగానే ఉందన్నారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి దేవానందకుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యాన పంటలు ఎక్కువగా పండిస్తున్నారని, రైతులకు విలువ ఆధారిత ఉత్పత్తులను వివరిస్తామన్నారు. కార్యక్రమంలో కీలకంగా వ్యవహరించిన సర్పంచ్ బొనిగే పోతన్న, శాస్త్రవేత్తలను సత్కరించారు. రైతులకు సేంద్రియ ఉత్పత్తులు అందించారు. అనంతరం రైతులు వారి సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లారు.



తిరంగా ర్యాలీలో పాల్గొన్న నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ రమణారావు, విద్యార్థులు

సైనికులకు నిట్ విద్యార్థుల సెల్యూట్

తాడేపల్లిగూడెం అర్బన్, మే 29(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రవాదులపై ఆపరేషన్ సిందూర్ పేరుతో సైనికుల పోరాటం అభినందనీయమని ఏపి నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ రమణారావు అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకుని గురువారం ఏపి నిట్‌లో నిర్వహించిన తిరంగా ర్యాలీలో సైనికులకు విద్యార్థులు సెల్యూట్ చేశారు. రమణారావు మాట్లాడుతూ దేశ రక్షణలో సైనికుల పాత్ర ఎంతో కీలకమన్నారు. భారత సైన్యం ధైర్య సాహసాలకు, త్యాగనిరతికి ఆపరేషన్ సిందూర్ ప్రతీక అని, ఈ విజయం భారత జవాన్ల సత్తాను ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. మాతృభూమి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ప్రతీ సైనికుడి జీవితం స్ఫూర్తిదాయకమేనని, విద్యార్థులు వారి త్యాగాలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జై భారత్, జై జవాన్ నినాదాలతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. రిజిస్ట్రార్ పి.దినేష్‌శంకర్ రెడ్డి, డీన్‌లు వి.సందీప్, హిమబిందు, ఆచార్యులు టి.కుర్మయ్య, గుర్రాల కిరణ్‌కుమార్, రాజేశ్వరరెడ్డి, నర్సింహరావు, అమరేంద్రరెడ్డి, శ్రీకాంత్, సునీల్ పాల్గొన్నారు.



పెదమల్లం మాచేనమ్మ ఆలయం గోదావరి రేవు వద్ద హెచ్చరిక బోర్డులు

గోదావరి రేవు ప్రమాదకరం
ప్రధాన రేవుల హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

ఆచంట, మే 29(ఆంధ్రజ్యోతి): అయోధ్యలంక శివారు రావిలంక గోదావరి నదిలో ముగ్గురు బాలురు ఈతకు వెళ్లి మృతి చెందారు. కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో కూడా గోదావరిలో పడి పలువురు మృతి చెందిన వరుస సంఘనలతో అధికారులు అప్రమత్తం అయ్యారు. అయోధ్యలంకలలో జరిగిన సంఘటన నేపథ్యంలో గోదావరి రేవుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదని ఆంధ్రజ్యోతిలో కథనంపై పోలీసులు స్పందించారు. గురువారం ఆయా రేవుల వద్ద గోదావరిలో స్నానాలు ప్రమాదకరం, స్నానాలు నిషేధించినట్లు పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గోదావరిలో ప్రమాదకర రేవుల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిరుపేద కడుపు నింపడమే సంక్షేమం
చేగొండి వెంకట హరరామజోగయ్య లేఖ

పాలకొల్లు, మే 29(ఆంధ్రజ్యోతి): పేదవాడికి పట్టెడన్నం పెట్టాలనే దృఢ సంకల్పంతో నాడు కిలో రెండు రూపాయలు బియ్యం పథకం అమలుతో ఎన్టీ రామారావు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని మాజీ ఎంపీ చేగొండి వెంకట హరిరామజోగయ్య అన్నారు. నిరుపేద కడుపు నింపడమే సంక్షేమమని, బియ్యం, పంచదారతో పాటు నిత్యావసరాలైన నూనె, పాలు, ఉల్లిపాయలు, మసాలా సరుకులు అందజేసి పేదవాడి ఆకలి తీర్చాలని కూటమి ప్రభుత్వానికి ఆయన బహిరంగ లేఖ రాశారు. లేఖను గురువారం పత్రికలకు విడుదల చేశారు. ముతక బియ్యం కాకుండా సన్న బియ్యం ఇవ్వాలన్నారు.

పశ్చిమ మహిళా సమాఖ్య అధ్యక్షురాలి ఎన్నిక

పాలకోడేరు, మే 29 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా మహిళా సమాఖ్య నూతన పాలకవర్గం గురువారం ఎన్నుకున్నారు. సహకార శాఖ సహకార అధికారి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో పాలకవర్గం ఎన్నికైంది. అధ్యక్షురాలిగా మణి (యలమంచిలి), వైస్ ప్రెసిడెంట్‌గా విజయలక్ష్మి (వీరవాసరం), సెక్రటరీగా నాగమణి (పోడూరు), జాయింట్ సెక్రటరీగా జయలక్ష్మి (ఉండి), కోశాధికారిగా ప్రసన్న (పాలకొల్లు) ఎన్నికయ్యారు. వీరికి వివిధ సమాఖ్యల ప్రెసిడెంట్లు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీపీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

అందని పసిడి



సామాన్యులకు భారం.. కళ తప్పిన నగల దుకాణాలు

నరసాపురం, మే 29(ఆంధ్రజ్యోతి): పసిడి ధర ఇంకా అందనంత ఎత్తులో ఉంది. నెల రోజుల క్రితం పది గ్రాముల ధర రూ. లక్ష దాటింది. తర్వాత లక్ష నుంచి దిగినా రూ.95 వేల పైన నిలకడగా ఉంది. ధర దిగితే కొందామని వినియోగదారులు ఎదురు చూస్తున్నారు. దాదాపు నెల రోజుల నుంచి రూ.90 వేల పైనే కొనసాగుతోంది. ధర ప్రభావం నగల దుకాణాలపై పడింది. ప్రస్తుతం సీజన్ అయినప్పటికీ దుకాణాల్లో కొనుగోలుదారుల జాడ లేదు. దీంతో జిల్లాలోని నగల దుకాణాలు వెలవెలబోతున్నాయి.

బులియన్ మార్కెట్‌లో గురువారం పది గ్రాముల బిస్కెట్ బంగారం రూ.96,500 పలికింది. అంటే గ్రాము బంగారం రూ.9,650. ఆర్నమెంట్ బంగారం కూడా గ్రాము రూ.8,900 దగ్గరే కొనసాగుతోంది. గత నెలలో బిస్కెట్ బంగారం గ్రాము రూ.10వేలు దాటింది. తర్వాత గ్రాము రూ.9,200 దగ్గర ఆగింది. ఆర్నమెంట్ బంగారం రూ.8,400 వరకు వచ్చింది. ధర మరింత తగ్గుతుందని అంతా అంచనా వేశారు. తర్వాత స్వల్పంగా పెరిగి ప్రస్తుతం రూ.9,650 వద్ద కొనసాగుతుంది. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ అయినా జిల్లాలో పసిడి కొనుగోళ్లు పడిపోయాయి. నరసాపురం, భీమవరం వంటి మార్కెట్‌ల్లో షాపులకు కస్టమర్ల కళ తప్పింది. బులియన్ మార్కెట్ వీధులు వెలవెలబోతు దర్శనమిస్తున్నాయి.

సినిమా సూపిత్త మామా

కూల్ డ్రింక్ గ్లాస్ రూ.50

- సినిమా థియేటర్లలో సౌకర్యాలపై అధికారుల తనిఖీ
- పారిశుధ్యం నిర్వహణ.. ఆహార పదార్థాల ధరలపై ఆరా



ఏలూరు సినిమా థియేటర్‌లో కూల్‌డ్రింక్ ధర ఆరా తీస్తున్న తహసీల్దార్

సినిమా థియేటర్లలో సౌకర్యాలు, ఆహార పదార్థాలు, కూల్ డ్రింక్స్ ధరలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఏలూరులో ఒక థియేటర్‌లో కూల్ డ్రింక్ 300 మి.లీ. గ్లాస్ రూ.50 ధర ఉండడంతో అధికారులు నోరెళ్ల బెట్టారు. మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేదని గుర్తించారు. నిబంధనలు పాటించి వసతులు సక్రమంగా అమలు చేయాలని థియేటర్ యాజమాన్యాలను ఆదేశించారు.

ఏలూరు / చింతలపూడి / భీమడోలు, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా రెవెన్యూ అధికారులు సినిమా థియేటర్లలో గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి సూచనలతో ఏలూరు నగరంతో పాటు జిల్లాలో సుమారు 45 థియేటర్లకు 32 థియేటర్లను తనిఖీ చేశారు. నగరంలో అంబికా థియేటర్ స్క్రీన్లను ఆర్డీవో అంబరీష్, తహసీల్దార్ జీవీ సత్యనారాయణ తనిఖీ చేశారు. సత్యనారాయణ థియేటర్‌లో 300 మిల్లి లీటర్ల కూల్ డ్రింక్ రూ.50 ధరకు అమ్మడంపై తహసీల్దార్ జీవీ.శేషగిరిరావు ప్రశ్నించారు. మిగతా చోట్ల రూ.40కే అమ్ముతున్నట్లు గుర్తించారు. అంబికా థియేటర్‌లో ఉదయం వేళ మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోవడాన్ని గుర్తించి సూచనలు ఇచ్చారు. బాలాజీ కాంప్లెక్సులో సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. లైసెన్సుల రెన్యువల్, టిక్కెట్ల రేట్లు, తినుబండారాలు, మరుగుదొడ్ల నిర్వహణ, సీటింగ్ కెపాసిటి, పార్కింగ్ వసతులపై అధికారులు ఆరా తీశారు. తినుబండారాల వినియోగంలో నాణ్యత పాటించడంతో పాటు, మంచినీరు, ఇతర వసతులను పక్కాగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కైకలూరు పట్టణంలోని విజయలక్ష్మి, మాగంటి, వెంకట రమణ థియేటర్ల తనిఖీ చేపట్టారు. పోలవరంలో గంగా భవాని థియేటర్‌లో వసతులు సంతృప్తిగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. చింతలపూడిలోని మూడు మల్టీ ప్లెక్స్ కాంప్లెక్‌తో పాటు ఒక థియేటర్‌లో తహసీల్దార్ ప్రమద్వర, అధికారులు తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, అగ్నిప్రమాద నియంత్రణ పరికరాలు, క్యాంటీన్‌లలో స్నాక్స్, డ్రింక్స్ ధరలను పరిశీలించారు. భీమడోలులో శ్రీనివాస్ థియేటర్ వసతులపై తహసీల్దార్ సంతృప్తి వ్యక్తం చేశారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని శ్రీరాజ రాజేశ్వరి, శ్రీలక్ష్మి థియేటర్లలో తహసీల్దార్ స్లీవజోజి తనిఖీ చేపట్టారు. ఫైర్ సేఫ్టీ యంత్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. క్యాంటీ న్లలో తినుబండారాలు ఎక్కువ రేట్లకు అమ్మవద్దని సూచించారు. షో పూర్తయిన తర్వాత టాయిలెట్లను క్లీన్ చేయాలని యాజమాన్యాలకు తెలిపారు. నూజివీడు పట్టణంలో ఒక థియేటర్ యాజమాన్యానికి నోటీసు జారీ చేశారు.



ఏలూరులో సినిమా థియేటర్ వద్ద టిక్కెట్ ధరల పట్టిక



చింతలపూడి థియేటర్‌లో అధికారుల పరిశీలన



సుంకర కల్యాణి (ఫైల్)

వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీ ఆత్మహత్య

ఏలూరు క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి): ఒక వైపు అనారోగ్యం.. మరో వైపు విధి నిర్వహణలో ఒత్తిడితో వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీ గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఏలూరు శాంతినగర్ 7వ రోడ్డులో నివాసం ఉంటున్న సుంకర కల్యాణి (28) శాంతినగర్ సచివాలయం 2లో హెల్త్ సెక్రటరీగా విధులను నిర్వర్తిస్తుంది. ఆమెకు అంగవైకల్యం, అనారోగ్య సమస్యలు ఉన్నాయి. ఈనెల 27న ఉదయం విధులకు వెళుతున్నానని భర్త రాయపరెడ్డి రామకృష్ణకు చెప్పి వెళ్లింది. నావల్ల ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలు అధిగమించలేక పోతున్నానని, నాకోసం వెతకవద్దు అని మెస్సేజ్ పెట్టి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసింది. ఈ సంఘటపై ఏలూరు త్రి టౌన్ పోలీసులకు రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కల్యాణి అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశారు. మరోవైపు ఆమె మృతదేహం రాజమహేంద్రవరం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గోదావరి నదిలో లభించింది. గట్టుపైన హ్యాండ్ బ్యాగ్, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ ఉండంతో బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

గోదావరిలో యువకుడి మృతదేహం లభ్యం

యలమంచిలి, మే 29(ఆంధ్రజ్యోతి): భీమవరం మండలం తాడేరు గ్రామానికి చెందిన షేక్ లాల్ మహ్మద్(24) మంగళవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదు. అతడి మృతదేహం గురువారం దిండి సమీపంలో గోదావరిలో లభ్యమైంది. మంగళవారం రాత్రి చించినాడ బ్రిడ్జిపై లాల్ మహ్మద్ బైక్, సెల్‌ఫోన్ ఉండడం తెలిసిందే. పోలీసులు యువకుడి ఆచూకీ కోసం రెండో రోజు గురువారం గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం అతడి మృతదేహం దిండి సమీపంలో గోదావరిలో లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి బావాలిషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

ఏలూరు క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఉంగుటూరు మండలం బాదంపూడికి చెందిన వగ్రే సతీష్‌కుమార్ (42) ఈనెల 27న మోటారు సైకిల్‌పై వెళుతూ మొయ్యేరు వద్ద ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. తణుకు ప్రభుత్వాసుపత్రికి అనంతరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం బుధవారం అర్ధరాత్రి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగం వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి అవుట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

వాహనం ఢీకొని..

ఏలూరు క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగా గాయపడిన యువకుడు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందాడు. సుమారు 35 ఏళ్ల యువకుడు హనుమాన్ జంక్షన్ సంత మార్కెట్ వద్ద బుధవారం రాత్రి పది గంటల ప్రాంతంలో జాతీయ రహదారిపై నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని 108 అంబులెన్సులో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతను గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి అవుట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

పెదపాడు మండలంలో..

పెదపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): తిమ్మనవీడులో జాతీయ రహదారి పక్కన నడిచి వెళుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. గాయపడిన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. సుమారు 40 ఏళ్ల వయసు, కాఫీ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96637 నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కుక్కలపై తుపాకీ కాల్పులు

- ఏలూరులో ఆగంతకుల దుశ్చర్య
- తొమ్మిది శునకాల మృత్యువాత
- ఒక పెంపుడు కుక్క మృతితో నిలదీసిన యజమానికి బెదిరింపు
- తుపాకీ శబ్దాలతో హడలిపోయిన పిల్లలు
- భయభ్రాంతులైన స్థానికులు



కాల్పులకు ముందు గుంపులుగా శునకాలు

ఏలూరు క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన ఏలూరు సమీపంలో శునకాలపై ఇద్దరు వ్యక్తులు తుపాకీతో కాల్చి చంపారు. పట్టపగలు బహిరంగ కాల్పులతో ప్రజలు భయభ్రాంతులయ్యారు. కాల్పులపై అడిగిన వారిని బెదిరించారు. చనిపోయిన వాటిలో ఒక పెంపుడు కుక్క ఉందని ప్రశ్నించిన యజమానికి సైతం ఎవరికైనా చెప్పినా ఊరుకోబోమని వార్నింగ్ ఇచ్చారు. బిక్కుబిక్కు మంటున్న ఆ కుటుంబానికి చుట్టు పక్కల వారు ధైర్యం చెప్పి జంతు సంరక్షణ సమితి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో కాల్పుల సంఘటన వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం ఏలూరు శనివారపుపేట వీవర్స్ కాలనీ, చింతమనేని కాలనీ ప్రాంతానికి సమీపంలో ఒక కోళ్ల ఫాం ఉంది. తరచుగా కోళ్ల ఫాం వద్ద కుక్కలు కోళ్లను పట్టుకు తింటున్నాయని చెబుతున్నారు. ఈనెల 27న సాయంత్రం 4.30 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు పాత మోటారుసైకిల్‌పై తుపాకీ పట్టుకుని వచ్చారు. గుంపుగా ఉన్న కుక్కలను కాల్చారు. ఒక కుక్కను చంపగానే ఒక పెంపుడు కుక్క వారిపైకి వెళ్లడంతో దానిని కూడా కాల్చేశారు. ఆ కుక్క యజమానులు ప్రశ్నిస్తే ఆగంతకులు భయపెట్టారు. తుపాకీ కాల్పులు వినబడడంతో సమీపంలో ఆడుకుంటున్న పిల్లలు పారిపోయారు. మద్యం మత్తులో ఆగంతకులు ఇద్దరు అక్కడే తిరిగి చనిపోయిన కుక్కలను పక్కనే ఉన్న తమ్మిలేరు కాల్వలోకి విసిరేశారని స్థానికులు చెబుతున్నారు. కుక్కలను చంపకూడదని ఇప్పటికే కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ కోళ్ల ఫాం యజమాని దుర్మార్గంగా వీధికుక్కలను బహిరంగంగా తుపాకీతో కాల్చి చంపించడంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే అంతు చూస్తామని ఆగతంకులు బెదిరించారని పెంపుడు కుక్క యజమానులు చెబుతున్నారు. వారి నుంచి తమకు పోలీసులు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏటిగట్టు పైనుంచి వాహనం బోల్తా



ఏటిగట్టు దిగువకు దూసుకుపోయిన సిమెంటు బల్కర్

పోలవరం, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహలక్ష్మి దేవిపేట శివారులో బుధవారం రాత్రి ఒక సిమెంటు బల్కర్ ఏటిగట్టు దిగువకు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ క్లీనర్ త్రుటిలో ప్రమాదం నుంచి బయట పడ్డారు. గురువారం ఆ బల్కర్‌ని ఏటిగట్టుపైకి తేవడానికి క్రేన్‌లను ఉపయోగించి వాహన యజమానులు ఇబ్బందులు పడ్డారు. వేగంగా వెళుతున్న ఇసుక వాహనాలను తప్పించబోయి వాహనం ఏటిగట్టు దిగువకు దూసుకుపోయిందని డ్రైవర్ తెలిపాడు. వాహనాన్ని పైకి తెచ్చే క్రమంలో ఆ మార్గంలో వెళుతున్న ఆర్టీసి బస్సులు ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుని ఆలస్యంగా వెళ్లాయి. పోలవరం నుంచి తాళ్లపూడి, కొవ్వూరు వరకూ ఇసుక లారీలు ఏటిగట్టుపై పార్కింగ్ చేయడం, వేగంగా రాకపోకలు సాగించడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇసుక ర్యాంపుల కోసం ఏటిగట్టు తవ్విన ప్రాంతంలో ట్రాఫిక్ సిగ్నల్స్, ప్రమాద సూచికలు లేకపోవడంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు



విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కాల్వలోకి దూసుకెళ్లిన కారు

కాళ్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): అతి వేగంతో వెళుతున్న కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి కాలువలోకి దూసుకెళ్లిన సంఘటన కాళ్ల మండలం కాళ్లకూరులో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జువ్వలపాలెం వైపు నుంచి వస్తున్న కారు అదుపు తప్పి అతివేగంతో సచివాలయం ఎదుట విద్యుత్ స్తంభాన్ని కొట్టి కాలువలోకి వెళ్లింది. కారు వేగానికి విద్యుత్ స్తంభం ముక్కలైంది. ప్రమాద సమయంలో కారులో చిన్న పిల్లలు కూడా ఉన్నారని స్థానికులు తెలిపారు. కారు బెలూన్ ఓపెన్ కావడంతో ప్రాణనష్టం జరగలేదు. చిన్న చిన్న దెబ్బలతో బయటపడిన వారిని స్థానికులు భీమవరం హాస్పిటల్‌కి తరలించారు. విద్యుత్ స్తంభం మాత్రం పూర్తిగా ధ్వంసమైంది.

కొడుకును హతమార్చిన తండ్రి అరెస్ట్



పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు

జంగారెడ్డిగూడెం, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలాపురం శివారు వీరన్నగూడెంలో ఈ నెల 26న కన్న కొడుకును హత్య చేసిన తండ్రిని అరెస్ట్ చేసినట్లు సిఐ వి.కృష్ణబాబు గురువారం తెలిపారు. కొయ్యలగూడెం మండలం సీతంపేటకు చెందిన కొప్పుల నాగేశ్వరరావుకు చికెన్ షాపు ఉంది. అతడికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు కొప్పుల పవన్ కుమార్ (24) డిగ్రీ పూర్తిచేసి అల్లరచిల్లరగా తిరుగుతూ చెడు అలవాట్లకు బానిసయ్యాడు. 9 నెలల క్రితం హైదరాబాదు వెళ్లాడు. తిరిగి తన స్వగ్రామం వచ్చి తనకు రూ.25 వేలు నగదు ఇవ్వాలని లేదంటే ఆస్తి పంచి ఇచ్చేయాలని తండ్రితో గొడవపడి కొట్టాడు. దీంతో తండ్రి నాగేశ్వరరావు కుమారుడిపై కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 26న పవన్‌కుమార్‌తో కలిసి పక్క గ్రామం తిరుమలాపురం శివారులో వీరన్నగూడెంలోని నరసయ్య చెరువుగట్టుపై ఉన్న పాకలోకి తీసుకువెళ్ళాడు. అక్కడ కుమారుడికి మద్యం బాగా పట్టించి మత్తులోకి జారుకున్నాక పీక కోసి పరారయ్యాడు. పోలీసులు నిందితుడిని పట్టుకుని కోర్టుకు హాజరు పరచడంతో రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన ఎస్సై జబీర్, ఏఎస్సై సంపత్, పీసీలు రమేష్, దిలీప్ పేర్లు రివార్డు కోసం సిఫారసు చేసినట్లు సీఐ తెలిపారు.

దారి దోపిడీ కేసులో నలుగురి అరెస్ట్

ఏలూరు క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళ ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై నిలబడి ఉండగా నలుగురు యువకులు వారిని బెదిరించి నగదు, సెల్‌ఫోన్ అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు నలుగురు యువకులను అరెస్టు చేశారు. ఏలూరులోని చిరంజీవి బస్టాండ్ ప్రాంతానికి చెందిన చాగంటి కాంతిరెడ్డి ఈనెల 25న రాత్రి 11 గంటలకు స్నేహితుడితో కలిసి దెందులూరు వెళ్లి వంట మేస్త్రి నుంచి రూ.5 వేలు తీసుకుని వస్తున్నారు. మార్గమధ్యలో ఆటోనగర్ బిట్‌బిట్ వద్ద నలుగురు యువకులు 2 మోటారు సైకిళ్లపై వచ్చి వారిని అడ్డగించి నగదు, సెల్‌ఫోన్ అపహరించుకుపోయారు. కేసు నమోదు చేసిన ఏలూరు రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నేరానికి పాల్పడిన గొల్లాయి గూడేనికి చెందిన గంటా సూర్య ప్రకాష్ (19), మరో ముగ్గురు బాల నేరస్తులను అరెస్టు చేశారు. వారి నుంచి నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

నరసాపురం రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వైఎస్‌పాలెంలో గురువారం మహిళ మెడలో గొలుసు అపహరించారు. భర్తతో కలిసి చెన్ను లక్ష్మి పట్టణానికి వెళ్లింది. తిరిగి వచ్చేందుకు జాతీయ రహదారిపై దిగిన వారికి ఆటో లేకపోవడంతో నడుచుకుంటూ వెళుతున్నారు. ఇంతలో వెనుక నుంచి బైక్‌పై వచ్చిన వ్యక్తి లక్ష్మి మెడలో మూడు కాసుల నల్లపూసల గొలుసును లాక్కుని బైక్‌పై ఉడాయించాడు. రెప్పపాటులో జరిగిన ఈ చోరీని పక్కఉన్న భర్త కూడా గమనించలేక పోయాడు. లక్ష్మి కేకలు వేయడంతో చుట్టు పక్కల వాళ్లు వచ్చే సమయానికి రోడ్డుపై బైక్ కనిపించలేదు. రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడిని పట్టుకునే ప్రయత్నం చేస్తున్నట్లు ఎస్సై వెంకట సురేష్ తెలిపారు.

9న దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి

ఏలూరుకార్పొరేషన్, మే 29(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జూన్ 9న జరిగే సమ్మెలో కార్మిక వర్గాలంతా పాల్గొని విజయవంతం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల గురవయ్య, బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం ఏలూరు స్ఫూర్తి భవన్‌లో జరిగిన ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా సమితి సమావేశంలో సి.హెచ్.కోటేశ్వరరావు, ఆవుల శేఖర్ పలు సూచనలు అందించారు. సార్వత్రిక సమ్మెకు 19 మందిని జిల్లా సమితి సభ్యులుగా ఎన్నుకున్నారు.

'టంగుటూరి ప్రకాశం' జీవిత చరిత్రపై అవగాహన

పెదపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా చేసిన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం మనందరికీ ఆదర్శప్రాయమని పెదపాడు శాఖ గ్రంథాలయాధికారి దుగ్గిపోగు జాన్‌బాబు తెలిపారు. పెదపాడు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధులు, వారి జీవిత చరిత్ర, నీతికథల పుస్తకాలు, వాటిల్లోని మంచి భావాలను తెలియజేశారు. అనంతరం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

మహానాడుకు తరలిన టీడీపీ శ్రేణులు

లింగపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి లింగపాలెం మండలంలోని అన్ని గ్రామాల నుంచి వెయ్యి మంది నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. పలువురు మంత్రులను, రాష్ట్రస్థాయి నాయకులను కలసి వారితో ఫొటోలు దిగుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన పలువురు ముఖ్యనాయకులు ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌తో కలసి పలువురు మంత్రులతో మండలంలో సాగవుతున్న పామాయిల్, కోకో, నిమ్మ పంటలకు మద్దతు ధర పెరిగేలా చూడాలని కోరినట్టు తెలిపారు.


మహానాడులో పాల్గొన్న లింగపాలెం మండల టీడీపీ నాయకులు


వడ్డన దగ్గర ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

మహానాడుకు పోటెత్తిన అభిమాన జనం

పెదవేగి, మే 29(ఆంధ్రజ్యోతి) : కడప గడ్డపై జరుగుతున్న పసుపు పండుగలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తన మార్క్ హవా చూపించారు. మహానాడు ప్రారంభానికి ఒకరోజు ముందే అక్కడకు చేరుకున్న ఆయన.. తనతో తీసుకెళ్లిన మామిడి కాయలతో అక్కడే ఆవకాయ పచ్చడి తయారు చేయించి, మూడు రోజులపాటు అతిథులకు వడ్డించారు. భోజనశాలలో అంతా తానే అయి, అతిథులు సంతృప్తిగా భోజనం చేసేలా పర్యవేక్షించారు. చివరిరోజు గురువారం పలువురు నాయకులు ఆయనను కలిసి అభినందించారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ భోజనశాల దగ్గర ఉన్న ప్రభాకర్‌ను కలిసి ప్రత్యేకంగా అభినందించారు. గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అభిమానంగా కలిసి మాట్లాడారు. పలువురు సెల్ఫీలు తీసుకున్నారు.

ఒంటిమిట్ట దేవాలయం సందర్శన

జంగారెడ్డిగూడెం : ఏపీ రాష్ట్ర మహిళల ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిసి కడపలోని ఒంటిమిట్ట దేవాలయం, పలు ప్రాచీన ఆలయాలను సందర్శించినట్టు పట్టణానికి చెందిన జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మెన్ షేక్ ముస్తఫా గురువారం తెలిపారు.

పోతునూరులో వేగంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు


పోతునూరులో రోడ్లను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

దెందులూరు,మే 29 (ఆంధ్రజ్యోతి) : పోతునూరు పంచాయతీ పరిధిలో రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయని, రోడ్లకు నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు స్థానిక ఎమ్మెల్యే చింతమనేనిని కోరడంతో రూ. 50 లక్షలను మంజూరు చేశారు. ఈమేరకు పోతునూరులో రూ.27 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్ల పనులను పోతునూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు నున్న లక్ష్మణ్‌బాబు, సహకార బ్యాంకు అధ్యక్షుడు బోడేటి మోహన్‌బాబు, కొత్త సాంబశివ రావు, పార్టీ కార్యదర్శి తోట సురేష్ బృందం పనులను పరిశీలించారు. ఉండ్రాజవరంలో రూ.23 లక్షలతో నిర్మిస్తున్న పనులను టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి బాయి రాంప్రసాద్, ఎర్నేటి పండు, సున్నా వెంకట్రావు, రాంబాబు నాయకులు పనులను పర్యవేక్షించారు.

జడ్పీ నిధులతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

జంగారెడ్డిగూడెం,మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్వాయిగూడెం మానవత కార్యాలయం వద్ద జడ్పీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు గురువారం నాయకులు శంకుస్థాపన చేశారు. జడ్పీటీసీ పొల్నాటి బాబ్జీ, గుర్వాయిగూడెం సర్పంచ్ గుబ్బల సత్యవతి, టీడీపీ నాయకులు పరిమి సత్తిపండు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మానవత సభ్యులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి రేషన్ షాపుల్లోనే సరుకుల పంపిణీ

నిడమర్రు మే 29 (ఆంధ్రజ్యోతి) : రేషన్ సరుకులు జూన్ ఒకటి నుంచి రేషన్ షాపుల వద్దే అందజేస్తారని నిడమర్రు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. గురువారం నిడమర్రు తహసీల్దార్ కార్యాలయం వద్ద మండలంలో గల 31 రేషన్ షాపు డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూన్ ఒకటి నుంచి 15వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో షాపుల వద్ద సరుకులు పంపిణీ చేస్తారన్నారు. సీనియర్ సిటిజన్స్, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు ఆయా డీలర్లు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్స్ డీటీ జరీనా, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

'నిమ్మకు గిట్టుబాటు ధర కల్పించాలి'

దెందులూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): నిమ్మకాయలకు గిట్టుబాటు ధర కల్పించి రైతును ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. రామారావుగూడెంలో నిమ్మతోటలను కౌలు రైతు సంఘం నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది ఇదే సీజన్‌లో కిలో రూ.100కుపైగా ధర వచ్చిందని, ప్రస్తుతం కిలో రూ.10 నుంచి రూ.24 వరకు మాత్రమే రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులతో కలసి నినాదాలు చేశారు.

2న ధర్నాను జయప్రదం చేయాలి

కామవరపుకోట, మే 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ జూన్ 2న స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు తెలిపారు. ధర్నాకు సంబంధించిన పోస్టర్స్‌ను స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద గురువారం ఆవిష్క రించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్-6 హామీలు అమలుపర్చాలని ఆందోళన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జి.సత్యనారాయణ, చలమాల శ్రీనివాసరావు, రాములమ్మ, బీవీ రామఫులు, కానూరు గంగరాజు తదితరులు ఉన్నారు.

కేసులను త్వరితగతిన పూర్తి చేయాలి


మాట్లాడుతున్న కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి) : లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, ప్యానల్ లాయర్ల ద్వారా విచారణ జరిగే కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు భరోసా ఇవ్వాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ న్యాయవాదుల ద్వారా వాదించే ఉచిత న్యాయ సేవలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత లీగల్ ఎయిడ్ కేసులను త్వరితగతిన పరిష్కరించడానికి సంబంధిత అధికారులు సమన్వయంతో కేసులు పరిష్కరించాలన్నారు. జూలై 5వ తేదీన నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించి ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారానికి తమ వంతు కృషి చేయాలని కోరారు.

నేడు చింతంపల్లిలో ఎమ్మెల్యే రోషన్ పల్లె నిద్ర

చింతలపూడి, మే 29 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి మండలం చింతంపల్లి గ్రామంలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ శుక్రవారం పల్లె నిద్ర చేయనున్నారు. సాయంత్రం ఐదు గంటలకు గ్రామంలో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తారు. ఆరు గంటలకు పల్లె వెలుగు-స్వర్ణ గ్రామం కార్యక్రమంలో పాల్గొంటారు. గ్రామసభలో అధికారులతో ప్రజల సమస్యలపై ముచ్చటించి ఆ గ్రామంల్లో పల్లెనిద్ర చేస్తారు.

ఏలూరు కాలువను ఏం చేస్తారు ?

(5వ పేజీ తరువాయి)

కాలువ కోసం అప్పట్లోనే రూ.130 కోట్లతో పనులు చేసేందుకు ఏజెన్సీని ఖరారు చేశారు. కాలువ తవ్వకం, గట్లు పటిష్ఠత, రివిట్‌మెంట్ వాల్స్ నిర్మాణం, లాకులు, తూముల ఏర్పాటు, వంతెన నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. కేవలం మట్టి పనులతోనే సరిపెట్టారు. అదికూడా తూతూమంత్రంగానే కాలువలో మట్టి తవ్వారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని వెంకయ్య వయ్యేరు, ఉండి, కాకరపర్రు, బ్రాంచ్ కెనాల్, గోస్తనీ కాలువల ఆధునికీకరణ పనులు అప్పట్లో దాదాపు పూర్తి చేశారు. ఏలూరు కాలువ పనులు మాత్రం చేపట్ట లేదు. అయినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. తదుపరి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు చిన్నచూపు చూశాయి. ఆధునికీకరణ సమయంలోనూ ఏలూరు కాలువను పూర్తిగా విస్మరించారు. కూటమి ప్రభుత్వంలోనైనా పనులు జరుగుతాయని అంతా ఆశించారు. ప్రభుత్వం రూ.20 లక్షలు మాత్రమే కేటాయించి మమ అనిపించింది. దీనిపై రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

అనుమతుల మాటున..!

(5వ పేజీ తరువాయి)

తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి.

- అధికారులు సంబంధిత చెరువులలో చేసిన మార్కింగ్‌ను బట్టి ఆ పరిధి లోనే అధికారులు సూచించిన మేర అనుమతులు ఇచ్చినంత మాత్రమే మట్టి తవ్వకం చేయాలి.
- చెరువు తూము లెవల్ కన్నా పైన మాత్రమే పూడిక మట్టిని తోలుకునేందుకు అనుమతులు ఇవ్వాలి.
- ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో ఆయా గ్రామాల పరిధిలో మాత్రమే వ్యవసాయ భూములను సారవంతం చేసుకునేందుకు లేదా గృహ అవసరాల మేరు వాకు మట్టి తోలకాలు చేపట్టాలి.
- అనుమతులు తీసుకునే సమయంలో క్యూబిక్ మీటర్‌కు రూపాయి చొప్పున శిస్తు చెల్లించాల్సి ఉంటుంది.

నిబంధనలు అతిక్రమిస్తే...

- నిబంధనలు అతిక్రమించి చెరువుల్లో మట్టి తోలకాలు చేస్తున్న అక్రమార్కులు కందకాలు పెట్టడం వల్ల వర్షాకాలంలో పశువులు చెరువులలోకి దిగిన అనేక మంది మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి.
- నిబంధనలకు విరుద్ధంగా లారీలతో ఇతర ప్రాంతాలకు మట్టి తోలకాలు చేపడితే గ్రామస్థులు అక్రమ మట్టి తోలకాలపై వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. లేదా గ్రామ రెవెన్యూ అధికారి,తహసీల్దార్, ఆర్డీవో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చు.


సురేష్‌ను అభినందిస్తున్న అంబికా రాజా, తదితరులు

సూక్ష్మ చిత్ర కళాకారుడు సురేశ్‌కు సత్కారం

ఏలూరు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : అంబికా దర్బార్ బత్తితో ప్రపంచ ఖ్యాతిగా తీసుకొచ్చిన అంబికా సంస్థల వ్యవస్థాపకులు ఆలపాటి రామచంద్రరావు విశేష కృషికి గాను ఆయన శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఏలూరు నగరానికి చెందిన సూక్ష్మ రూప చిత్ర కళాకారుడు, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్ హోల్డర్ మేతర సురేశ్‌బాబు ఆలపాటి రామచంద్రరావు చిత్రాన్ని అగ్గిపుల్లపై అతి సూక్ష్మగా చెక్కాడు. ఆ కళారూపాన్ని గురువారం అంబికా భవన్‌లో అంబికా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అంబికా రాజాకి బహూకరించారు. ఈ సందర్భంగా అంబికా రాజా మాట్లాడుతూ అభిమానానికి నిజమైన విలువ అని, ఇటువంటి చిత్రకారుడు ఏలూరులో ఉండటం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా సురేశ్‌ఉ అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో మున్నుల జాన్ గురునాథ్, పయిడేటి రఘు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరుటూటౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ నాయకులు సోమయ్య డిమాండ్ చేశారు. మునిసిపల్ కార్యాలయం ఎదురుగా కార్మికులు చేస్తున్న ధర్నా పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్డ్ కార్మికులకు తక్కువ జీతాలు ఇస్తూ, అన్‌స్కిల్డ్ కార్మికులకు ఎక్కువ జీతాలిస్తున్నారని ఆరోపించారు. ఈ తేడాను సరి చేయాలన్నారు. ఉద్యోగులకు బకాయి పడిన జీతాలు చెల్లించలన్నారు. విధినిర్వహణలో చనిపోయిన కార్మికులకు రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఆదివారాలు, పండుగ సెలవు దినాల్లో పనిచేసిన వారికి జీతాలు చెల్లించాలన్నారు.

నగరం వెలుపలకు పందులను తరలించాలి


మాట్లాడుతున్న కమిషనర్ భానుప్రతాప్

ఏలూరుటూటౌన్, మే29 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పందులు విచ్చలవిడిగా తిరగడం పట్ల మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాల యంలో పందుల యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పందుల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎన్నో ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. గతంలో పందుల యాజమానులకు హెచ్చరించామని, ఇప్పటికైనా నగరం వెలుపలకు పందులను తరలించకపోతే యాజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. కొవిడ్ మరోసారి విజృంభిస్తుండడంతో ప్రజలు ఆందోళనలో ఉన్నారని అన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని పందుల యాజమానులు పోణంగిలో ఏర్పాటు చేసిన స్థలాల్లోకి తరలించాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంకు అప్పారావు సేవలు ఆదర్శనీయం

ఏలూరుకార్పొరేషన్, మే 29(ఆంధ్రజ్యోతి):స్వాతంత్ర సమరయోధులు, సీపీఐ సీనియర్ నేత సంకు అప్పారావు జాతికి చేసిన సేవలు ఆదర్శనీయమని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కనకం వారి వీధిలో గల అప్పారావు విగ్రహం వద్ద గురువారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంకు అప్పారావు, కనకం సోం బసవరాజు వర్ధంతి కార్యక్రమాలను సీపీఐ నిర్వహించింది. సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి కురెళ్ళ వరప్రసాద్, రెడ్డి శ్రీనివాసడాంగే, కడుపు కన్నయ్య, గేదెల నాగేశ్వరరావు, పుప్పాల కన్నబాబు, యర్రా వెంకటేశ్వర్లు, కనకం జగన్, బేతా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ వేగవంతం చేయండి

బుట్టాయగూడెం, మే 29(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల నిర్వాసితులుగా మారుతున్న గిరిజన నిర్వాసితుల కోసం ఏజెన్సీ మండలాల్లో భూసేకరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ సరళవందనం అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. గురువారం బుట్టాయగూడెం రెవెన్యూ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని అందుకు తగిన ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. మూడు రోజుల క్రితం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అభిషేక్ బుట్టాయగూడెంలో పర్యటించి భూములు ఇస్తామన్న రైతులతో మాట్లాడారు. అవే భూములను నిర్వాసితులకు చూపించారు. నిర్వాసితులకు భూమి అవసరం ఉన్నందున వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎంవీ రమణ, తహసీల్దార్ పీవీ చలపతిరావు సిబ్బంది పాల్గొన్నారు.

దత్తసాయి ఆలయంలో ప్రత్యేక పూజలు

పోలవరం మే29: పోలవరంలో వున్న దత్తసాయి ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతపోలవరం గ్రామానికి చెందిన పలివెల నాగజ్యోతి 108 కొబ్బరి కాయలు కొట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం బయట అన్నదాన సత్రంలో అమెరికాలో స్థిరపడిన ప్రవాస ఆంధ్రులు ఆకుల రాజీవ్ సౌజన్య కుమారుడు ప్రణీత్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


ఉంగుటూరు కమ్యూనిటీ హాలులో యోగా చేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

'యోగా' భారతీయ సంస్కృతిలో భాగం : ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు/ఏలూరుటూటౌన్/పెదవేగి, మే 29(ఆంధ్రజ్యోతి): యోగా భారతీయ సంస్కృతిలో ఒక భాగమని, యోగా ద్వారా మన శరీరం, మనస్సుకు సమతుల్యత కలుగుతుందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం 'యోగాంధ్ర-2025' కార్యక్రమంలో భాగంగా ఉంగుటూరు కమ్యూనిటీ హాలులో జరిగిన యోగా సాధనకు ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ప్రజల్లోకి యోగాను తీసుకువెళ్లాలన్నారు. సర్పంచ్ బండారు సింధుమధు, ఎంపీడీవో రాజ్‌మనోజ్, పి.రాంబాబు, వంగా రఘు తదితరులు పాల్గొన్నారు. ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణరావు ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగా చేయించారు. అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ.సందీప్‌కుమార్, అస్లాం పాషా పాల్గొన్నారు. పెదవేగి మండలం మండల పరిషత్ కార్యాల యంలో యోగా మాస్టర్ ట్రైనర్ సీహెచ్.ప్రవీణ్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందికి గురువారం యోగాపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొప్పాక, ముండూరు ఆయుష్ ఆసుపత్రుల వైద్యులు డాక్టర్ ఎల్.శ్రీనివాసరావు, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.


కుక్కునూరులో సీపీఐ జెండా ఎగురవేస్తున్న అక్కినేని వనజ, తదితరులు

పోలవరం నిర్వాసితులతో కేంద్ర, రాష్ట్రాలు పరిహాసం

కుక్కునూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు 45.17 కాంటూరు లెవెల్‌లో ప్రాజెక్టు నిర్మాణం జరిగితేనే రాష్ట్రానికి మేలు జరుగుతుందని కానీ ప్రాజెక్టు కోసం భూములను, ఉన్న గ్రామాలను త్యాగం చేసిన నిర్వాసితులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిహాసం ఆడుతున్నాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ఆరోపించారు. గురువారం కుక్కునూరులో సీపీఐ 16వ మండల మహాసభలో ఆమె మాట్లాడారు. పేదల భూపోరాటం, పోడుభూమి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాడి పలు సమస్యలు పరిష్కరించిన ఘనత సీపీఐకే సాధ్యమైందన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాలను యూనిట్‌గా తీసుకుని ప్రతీ నిర్వాసితునికి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కావస్తున్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో విఫలమైందని ఆరోపించారు. తొలుత కుక్కునూరులో సీపీఐ జెండాను ఆవిష్కరించి భారీ ర్యాలీ నిర్వహించారు. నాయకులు ఎండీ.మున్నీర్, కారం ధారయ్య, ఎం.వెంకటాచారి, బాడిస రాము, ఐతా సురేశ్, పొన్నే లక్ష్మయ్య, వరకా శ్యామల, బాబూరావు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ఏలూరు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో వెన్న శ్రీలత అన్నారు. ఉద్యాన, వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ అధికారులతో గురువారం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామాల వారీగా ఆయా శాఖల ప్రణాళికలు వివరించారు. రూరల్ మండలం సాగులో విస్తీర్ణం పెంచేందుకు చర్యలు, గ్రామీణ పేదలకు ఆదాయం పెంచి జీవన ప్రమాణాల వృద్ధి చెందేలా పాడి పశువులు గొర్రెల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. దీనిని మరింత ముందుకు తీసుకువెళ్ళేందుకు, ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పశు గ్రాసం పెంపునకు ప్రోత్సహించేలా ఆయా శాఖల అధికారులు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఎంపీవో జీవన సంధ్య, హార్టికల్చర్ అధికారి కరణ్, వెటర్నరీ డాక్టర్ లక్ష్మి, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీలో వెదురు పంట పెంపకంపై అవగాహన

బుట్టాయగూడెం, మే 29(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో వెయ్యి మంది ఎస్సీ, ఎస్టీ రైతులతో వెదురు పంటను సాగు చేయడానికి ప్రభుత్వ అనుమతితో ప్రణాళికను సిద్ధం చేశామని వెలుగు ఏపీడీ ఈ.రాజబాబు తెలిపారు. వెదురు పంట సాగులో భాగంగా గురువారం బుట్టాయగూడెం వెలుగు కార్యాలయం ఆవరణలో ఎస్సీ, ఎస్టీ రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జన్‌మన్ పథకంలో భాగంగా ఇండస్ట్రీ ఫౌండేషన్ ద్వారా వెదురు పెంపకానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. వ్యవసాయ యోగ్యంకాని భూమిలో మొదటగా 35 సెంట్ల భూమిలో పంటను సాగుచేస్తారన్నారు. ఒక్కో మండలంలో 500 మంది రైతులను ఎంపిక చేసి పంటను సాగు చేసిన తరువాత రైతుల ఎంపికను చేపడతామన్నారు. ఆసక్తి గల రైతులు ఉంటే వెలుగు కార్యాలయం అధికారులు, సిబ్బంది ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. 35 సెంట్ల భూమిలో నాటేందుకు ప్రతి రైతుకు 60 మొక్కలను ఇస్తామని ఫలసాయం వచ్చేవరకు పంట బాగోగులు చూసు కోవడానికి రైతులకు ఉపాధి పథకంలో మెయింటినెన్స్ అందజేస్తామన్నారు. 4 ఏళ్ల తర్వాత ఒక్కో గూపునుంచి 12 కర్రలు వస్తాయని, గూపునకు 8 కర్రలు నరికినా రూ.30 వేల నుంచి రూ.40 వేల ఆదాయం వస్తుందని ఆ తర్వాత 40 ఏళ్ల వరకు ఆదాయం పొందవచ్చన్నారు. డీఆర్‌డీఏ పామ్ ఏపీఎం ఈ.వేణుగోపాల్, ఫౌండేషన్ ప్రతినిధులు ఎం.అక్షయ్, కె.కుసుమకుమారి, ఏపీఎంలు పద్మావతి, ఝాన్సీ సీసీలు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

'అమరవీరుల త్యాగాల ప్రజా సమస్యలపై పోరాటం'

పెదపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి) : అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. పెదపాడు గ్రామానికి చెందిన ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, అమరవీరుడు నర్రా ఆంజనేయులు 75వ వర్ధంతిని పురస్కరించుకుని పెదపాడులో అమరవీరుల స్థూపం వద్ద గురువారం నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ నర్రా ఆంజనేయులు ఉన్నత చదువులు చదువుకుని పీడిత ప్రజల కోసం పనిచేశారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్, రామకృష్ణ, కరీముల్లా, షఫీరా, గారపాటి రాజా తదితరులు పాల్గొన్నారు.


శ్రీవారు, అమ్మవార్ల చిత్రపటాన్ని అందుకుంటున్న కలెక్టర్ వెట్రిసెల్వి

శ్రీవారి సేవలో కలెక్టర్ వెట్రిసెల్వి

ద్వారకాతిరుమల, మే 29 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి గురువారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు దేవాలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. తొలుత ఆమె శ్రీవారి దివ్యమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకు న్నారు. అనంతరం ఆలయ ముఖమండపంలో అర్చకులు ఆమెకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పివేదాశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి ఆమెకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని ప్రసాదాలను అందజేశారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ, తహసీల్దార్ జేవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద బాధితులకు రూ.30 వేలు సాయం

ద్వారకాతిరుమల : సేవే పరమావధిగా పనిచేస్తున్న టీడీపీ నేత అభినందనీయుడని పలువురు గ్రామస్థులు కొనియాడారు. ద్వారకాతిరుమల మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న జి.కొత్తపల్లికి చెందిన రేగంటి రాంబాబు తమ గ్రామ పరిసరాలకు చెందిన ముగ్గురు నిరుపేద బాధితులకు రూ.30వేలు ఆర్థిక సాయం అందించారు. అదే గ్రామానికి చెందిన కేన్సర్‌తో పోరాడుతున్న గెద్దం వెంకటలక్ష్మికి, బైక్ ప్రమాదంలో గాయపడి శస్త్ర చికిత్స చేయించుకున్న గొడుగుపేటకు చెందిన కుక్కల నరసింహ, వెంకటేష్‌లకు రూ. 10వ వేలు చొప్పున అందించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు

ఏలూరు అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన కెమిస్ట్రీ పరీక్షకు 14మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా జరుగుతున్న ప్రాక్టికల్స్‌కు 83మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 42 మంది హాజరయ్యారని ఆర్ఐవో యోహాన్ తెలిపారు.

నాగిరెడ్డిగూడెంలో ఎక్సైజ్ అవుట్‌పోస్టు

చింతలపూడి, మే 29 (ఆంధ్రజ్యోతి) :చింతలపూడి నగర పంచాయతీ నాగిరెడ్డిగూడెంలో ఎక్సైజ్ అధికారులు ఎక్సైజ్ అవుట్ పోస్టును ఏఈఎస్ పాండురంగారావు సమక్షంలో ప్రారంభించారు. ఈ గ్రామంలో అధికంగా నాటుసారా తయారీ, అమ్మకాలు జరుపుతున్నందున అవుట్ పోస్టును ఏర్పాటు చేశారు. సర్కిల్ పరిధిలో నాగిరెడ్డిగూడెం, కంచెనగూడెం, రేచర్ల, తలార్లపల్లి గ్రామాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు జరిపి ఈ.కోటేశ్వరరావు, కె.కృష్ణ, వేముల మురళీ కృష్ణ, దేశావతు లక్ష్మి పరారీలో ఉన్న ఈ నిందితులను పట్టుకుని కోర్టుకు హాజరు పర్చగా రిమాండ్ విధించినట్టు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పి.భోగేశ్వరరావు, ఎస్ఐలు నరసింహారావు, ఖలీల్, జగ్గారావు పాల్గొన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

టి.నరసాపురం, మే29 (ఆంధ్రజ్యోతి): పేకాటస్థావరంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్ఐ జయబాబు తెలిపారు. బండివారిగూడెం గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారంతో తన సిబ్బందితో దాడి చేసి ముగ్గురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.2,130 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

నేడు విద్యుత్ నిలుపుదల ప్రాంతాలు

లింగపాలెం/పెదవేగి,మే28(ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండలంలో విద్యుత్ మరమ్మతుల కారణంగా రంగాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ధర్మాజీగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు.

● పెదవేగి మండలం జానంపేటలో మరమ్మతుల కార ణంగా 30, 31వ తేదీల్లో రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏలూరు ఈఈ కేఎం.అంబేద్కర్ తెలిపారు. జానంపేట, జగన్నాథపురం, బి.సింగవరం, ముత్తనవీడు గ్రామాల్లో రెండురోజుల పాటు ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తామ న్నారు. పెదవేగిలోని విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పెదవేగి, గార్లమడుగు, లక్ష్మీపురం గ్రామాల్లోని వినియోగదారులు సహకరించాలన్నారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి

ఏలూరు క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగా గాయపడిన యువకుడు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందాడు. సుమారు 35 ఏళ్ల యువకుడు హనుమాన్ జంక్షన్ సంత మార్కెట్ వద్ద బుధవారం రాత్రి పది గంటల ప్రాంతంలో జాతీయ రహదారిపై నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని 108 అంబులెన్సులో ఏలూరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతను గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతదేహాన్ని ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

పోలీసు సిబ్బందికి బదిలీలు

ముదినేపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఐదుగురు సిబ్బందిని సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ స్టేషన్ నుంచి నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, ఒక కానిస్టేబుల్ బదిలీ అయ్యారు. హెచ్‌సీ శ్రీనివాసరావు, ఉమెన్ పీసీ భూ లక్ష్మీ, కైకలూరు పట్టణ పోలీస్ స్టేషన్‌కు, హెచ్‌సీలు విజయ్ నూజివీడు, నాగ శ్రీనివాసరావు, శ్రీను మండవల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. వీరిలో ముగ్గురు గురువారం రిలీవ్ అయ్యారు.

చౌక ధరల దుకాణాల్లో ఏర్పాట్లు



ముదినేపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల అనంతరం తిరిగి ప్రభుత్వ చౌక ధరల దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ ప్రారంభం కానుంది. వినియోగదారులకు జూన్ 1వ తేదీ నుంచి చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యంతోపాటు ఇతర సరుకులను పంపిణీ చేయనున్నారు. ముదినేపల్లి మండలంలో రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులు చౌక ధరల దుకాణాల్లో సరుకులు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. తహసీల్దార్ పవన్ కుమార్, సివిల్ సప్లయిస్ డీటీ ఎమిలి కుమారి గురువారం మండలంలోని ప్రభుత్వ చౌక ధరల దుకాణాలను పరిశీలించి బియ్యం పంపిణీ ఏర్పాటుపై డీలర్లకు సూచనలు చేశారు. ఎండియూ వాహనాల రద్దుతో ఇక ముందు చౌక ధరల దుకాణాలను పూర్తిస్థాయిలో నిర్వహించేందుకు రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ సిస్టమ్‌లను సిద్ధం చేసే పనులను అధికారులు పరిశీలిస్తున్నారు. మండలంలోని 39 చౌక ధరల దుకాణాల ద్వారా సుమారు 19400 రేషన్ కార్డులకు బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల పంపిణీకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా దుకాణాల వద్ద ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ పవన్ కుమార్ తెలిపారు.

రేషన్ షాపుల పరిశీలన

కలిదిండి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టగుంట, భాస్కరావుపేట గ్రామాల్లో రేషన్ దుకాణాలను తహసీల్దార్ రామకృష్ణ, వీఆర్వోలు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల్లో సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. షాపుల వద్ద ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. ఈ పోస్ మిషన్లు సక్రమంగా పని చేస్తున్నాయో లేదోనని సరి చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు డేవిడ్, జగన్, వీఆర్ఏలు పాల్గొన్నారు.

హైస్కూళ్ల హెచ్‌ఎంల బదిలీ

ముదినేపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలోని నాలుగు జిల్లా పరిషత్ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు బదిలీ అయ్యారు. గురజ హైస్కూలు హెచ్‌ఎం జి.కృష్ణమోహన్ కృష్ణా జిల్లా పామర్రు మండలం అడ్డాడ హైస్కూలుకు, బొమ్మినంపాడు హైస్కూలు హెచ్‌ఎం శ్రీలక్ష్మీ కృష్ణా జిల్లా గుడివాడ రూరల్ మండలం చౌటపల్లి హైస్కూలు హెచ్‌ఎంగా, చిగురుకోట హైస్కూల్ హెచ్‌ఎం ఆర్.శ్రీధర్ కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం కాటూరు హైస్కూలుకు బదిలీ కాగా, ఎంతో కాలంగా ఖాళీగా ఉన్న పెదపాలపర్రు హైస్కూల్ హెచ్‌ఎంగా కైకలూరు మండలం భుజబలపట్నం హైస్కూలు హెచ్‌ఎం రాజ్యలక్ష్మిని బదిలీ చేస్తూ విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

మహానాడులో ముదినేపల్లి నేతలు



ముదినేపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశంపార్టీ మహానాడు కార్యక్రమంలో చివరి రోజైన గురువారం ముదినేపల్లి మండలం పార్టీ నాయకులు పలువురు పాల్గొన్నారు. మండలానికి చెందిన పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు మహానాడు సభలో పాల్గొని సీనియర్ నాయకులను, ఎమ్మెల్యేలను కలిశారు. నియోజకవర్గ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ తదితర నాయకులు మహానాడు సభలో పాల్గొనగా, వణుదుర్రు గ్రామ టీడీపీ నాయకులు మహానాడు సభ ముగిసిన అనంతరం ఎమ్మెల్యేలు వర్లకుమార్‌రాజా, వెనిగండ్లరాము, కాగిత కృష్ణ ప్రసాద్‌లను కలిశారు. పలువురు నాయకులు ఒంటిమిట్ట రామాలయం, కడప దర్గాను కూడా సందర్శించారు.

చంద్రబాబు ఎన్నికపై బీజేపీ నేత హర్షం

ముదినేపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా నారా చంద్రబాబు నాయుడు తిరిగి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల భారతీయ జనతాపార్టీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ ప్రజలకు మరిన్ని సేవలందించాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించాలని కృష్ణారావు ఆకాంక్షించారు.



అయ్యవారిరుద్రవరం వద్ద కైకలూరు పంట కాలువలో తవ్వకాలు చేస్తున్న ఎక్స్‌కవేటర్

వేసవిలోనే కాలువల ఆధునికీకరణ

మండవల్లి మే 29(ఆంధ్రజ్యోతి): వేసవిలో కాలువల ఆధునికీరణతో నీటి సరఫరాకు అవరోధం లేకుండా చేస్తున్నామని డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు అన్నారు. గురువారం మండవల్లి మండలంలోని అయ్యవారిరుద్రవరం వద్ద పోల్‌రాజ్, కైకలూరు పంటకాలువల్లో ఎక్స్‌కవేటర్లతో తవ్వకం పనులను చేపట్టారు. కాలువలకు నీరు విడుదల చేయకుండానే ముందస్తుగా తవ్వకం పనులు చేయడం వలన రానున్న రోజుల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీరు సరఫరా అవుతుందన్నారు. ఈ తవ్వకం పనులను కైకలూరు శివారు వరకు, తాడినాడ వరకు చేపడతామన్నారు. ఈ వేసవిలోనే కాలువలు తవ్వకాలు చేయడం వలన కాలువల్లో తూడు, డెక్క నిర్మూలనకు సాధ్యపడుతుందన్నారు. అలాగే పంటకాలువల్లో చెత్తాచెదారం, కోళ్లవ్యర్థాలు వేస్తే చట్టరీత్యా చర్యలు తీసకుంటామని ప్రజలు తాగునీరులో కలుషిత వ్యర్థాలు కలవడం వలన అనారోగ్యాలకు గురవుతారని ప్రజలు స్వచ్ఛందంగా గుర్తించి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలిదిండి డీసీ చైర్మన్ పేటేటి సత్యనారాయణ, ఇరిగేషన్ ఏఈ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

వచ్చే నెలలో రైతు బజార్ ప్రారంభం

ఎట్టకేలకు నిర్మాణాలు పూర్తి

కలిదిండి, మే 29 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో ఏడు ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న రైతు బజార్ నిర్మాణ పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. 2018లో టీడీపీ హయాంలో రైతు బజార్ నిర్మాణం 70 శాతం పూర్తి చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లలో 10 శాతం పనులే చేశారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తిగా ఉన్న రైతు బజార్ నిర్మాణానికి రూ.27 లక్షలు నిధులు మంజూరు చేయటంతో



ప్రారంభానికి సిద్ధమైన రైతు బజార్

రైతు బజార్ నిర్మాణ పనులు శరవేగంగా జరిగాయి. రైతు బజార్‌లో మొత్తం 17 కూరగాయల దుకాణాలను ఏర్పాటు చేసుకునే విధంగా నిర్మించారు. టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. రైతు బజార్ ఆవరణంతా టైల్స్ వేశారు. కూరగాయల దుకాణాలకు రంగులు వేయాల్సి ఉంది. రైతు బజార్ ఆవరణ చుట్టూ ప్రహరీ నిర్మాణం పూర్తి చేశారు. జూన్ నెలలో రైతు బజార్‌ను ప్రారంభించటానికి సన్నాహాలు చేస్తున్నామని మార్కెట్ యార్డు కార్యదర్శి వరలక్ష్మీ తెలిపారు.

రహదారులు అధ్వానం





అధ్వానంగా ఉన్న సగ్గురు రోడ్డు.. గుంతలు పడిన వట్టిగుడిపాడు రోడ్డు

ఆగిరిపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండలంలో పలు గ్రామాల్లోని ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. వట్టిగుడిపాడు గ్రామంలోని ప్రధాన రహదారి గుంతలు పడి వర్షపునీరు నిలిచి ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గుంతల వలన ఎదురెదురు వచ్చే వాహనాలు తప్పుకోవడానికి వీలు లేకుండా ఉన్నాయి. ఈదులగూడెం, చొప్పరమెట్ల ప్రధాన రహదారిలో భారీగా గుంతలు పడినాయి. కొద్ది నెలల క్రితం చొప్పరమెట్ల వద్ద రోడ్డుపై కంకర పోసి వదిలేశారు. ఈ వర్షానికి కంకర మొత్తం కొట్టుకొని పోయి భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డులో తిరిగే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. చొప్పరమెట్ల నుంచి సగ్గురు వెళ్ళే రోడ్డు భారీ గుంతలు ఏర్పడి అస్తవ్యస్తంగా మారింది. చొప్పరమెట్ల నుంచి సగ్గురు రోడ్డు సుమారు 4 కిలోమీటర్ల వరకు కంకర రాళ్లు బయటకు తేలాయి. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుచున్నారు. దీనిపై ఆర్అండ్‌బి అధికారి గోళ్ల అశోక్ కుమార్‌ను వివరణ కోరగా పై అధికారులతో సంప్రదించి త్వరలోనే రోడ్లకు మరమ్మతులు చేపడతామని తెలిపారు.

థియేటర్లలో తనిఖీలు

ఆహార పదార్థాల నాణ్యత.. టిక్కెట్ల ధరలు.. పారిశుధ్యం పరిశీలన



నూజివీడులో సినిమా థియేటర్లను తనిఖీ చేస్తున్న రెవెన్యూ అధికారులు



కైకలూరు విజయలక్ష్మి థియేటర్‌లో తహసీల్దార్ తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

నూజివీడు టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు పట్టణంలోని సినీ థియేటర్లను రెవెన్యూ అధికారుల బృందం సోమవారం తనిఖీలు నిర్వహించింది. నూజివీడు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ నేతృత్వంలోని అధికారులు పట్టణంలోని ద్వారక సినిమాస్, సత్యనారాయణ థియేటర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్యం, థియేటర్‌లలో విక్రయిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, ఎంఆర్పీ, టికెట్లు రేట్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

కైకలూరు: సినిమాహాల్స్‌లో అధిక ధరలకు ఆహారపదార్థాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం అన్నారు. గురువారం కైకలూరులోని వెంకటరమణ, మాగంటి, విజయలక్ష్మీ థియేటర్లలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించారు. థియేటర్లలోని టాయిలెట్స్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆహార పదార్థాలు, వాటర్‌బాటిల్స్ రేట్లు తెలుసుకుని ఎమ్మార్పీకే విక్రయించాలని ఆదేశించారు. ఇకపైన అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారమిస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బి వెంకటేశ్వరరావు, వీఆర్వోలు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీ ఆత్మహత్య



సుంకర కల్యాణి (ఫైల్)

ఏలూరు క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి): ఒక వైపు అనారోగ్యం.. మరో వైపు విధి నిర్వహ ణలో ఒత్తిడితో వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీ గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఏలూరు శాంతినగర్ 7వ రోడ్డు లో నివాసం ఉంటున్న సుంకర కల్యాణి (28) శాంతినగర్ సచివాలయం 2లో హెల్త్ సెక్రటరీగా విధులను నిర్వర్తిస్తుంది. ఆమెకు అంగవైకల్యం, అనారోగ్య సమస్యలు ఉన్నా యి. ఈనెల 27న ఉదయం విధులకు వెళుతున్నానని భర్త రాయపరెడ్డి రామకృష్ణకు చెప్పి వెళ్లింది. నావల్ల ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలు అధిగమించలేక పోతున్నానని, నాకోసం వెతకవద్దు అని మెసేజ్ పెట్టి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసింది. ఈ సంఘటపై ఏలూరు త్రి టౌన్ పోలీసులకు రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కల్యాణి అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశారు. మరోవైపు ఆమె మృతదేహం రాజమహేంద్ర వరం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గోదావరి నదిలో లభించింది. గట్టుపైన హ్యాండ్ బ్యాగ్, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ ఉండంతో బంధువులకు సమాచారం ఇచ్చా రు. మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఏలూరు కాలువను ఏం చేస్తారు ?

(5వ పేజీ తరువాయి)

కాలువ కోసం అప్పట్లోనే రూ.130 కోట్లతో పనులు చేసేందుకు ఏజెన్సీని ఖరారు చేశారు. కాలువ తవ్వకం, గట్టు పటిష్టత, రివిట్‌మెంట్ వాల్స్ నిర్మాణం, లాకులు, తూముల ఏర్పాటు, వంతెన నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. కేవలం మట్టి పనులతోనే సరిపెట్టారు. అదికూడా తూతూమంత్రంగానే కాలువలో మట్టి తవ్వారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని వెంకయ్య వయ్యేరు, ఉండి, కాకరపర్రు, బ్రాంచ్ కెనాల్, గోస్తనీ కాలువల ఆధునికీకరణ పనులు అప్పట్లో దాదాపు పూర్తి చేశారు. ఏలూరు కాలువ పనులు మాత్రం చేపట్టలేదు. అయినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. తదుపరి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు చిన్నచూపు చూశాయి. ఆధునికీకరణ సమయంలోనూ ఏలూరు కాలువను పూర్తిగా విస్మరించారు. కూటమి ప్రభుత్వంలోనైనా పనులు జరుగుతాయని అంతా ఆశించారు. ప్రభుత్వం రూ.20 లక్షలు మాత్రమే కేటాయించి మమ అనిపించింది. దీనిపై రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

అనుమతుల మాటున..!

(ఐదో పేజీ తరువాయి)

తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి.

- అధికారులు సంబంధిత చెరువులలో చేసిన మార్కింగ్‌ను బట్టి ఆ పరిధిలోనే అధికారులు సూచించిన మేర అనుమతులు ఇచ్చినంత మాత్రమే మట్టి తవ్వకం చేయాలి.
- చెరువు తూము లెవల్ కన్నా పైన మాత్రమే పూడిక మట్టిని తోలుకునేందుకు అనుమతులు ఇవ్వాలి.
- ఎడ్ల బండ్లు, ట్రాక్టర్‌లతో ఆయా గ్రామాల పరిధిలో మాత్రమే వ్యవసాయ భూములను సారవంతం చేసుకునేందుకు లేదా గృహ అవసరాల మేరువాకు మట్టి తోలకాలు చేపట్టాలి.
- అనుమతులు తీసుకునే సమయంలో క్యూబిక్ మీటర్‌కు రూపాయి చొప్పున శిస్తు చెల్లించాల్సి ఉంటుంది.

నిబంధనలు అతిక్రమిస్తే...

- నిబంధనలు అతిక్రమించి చెరువుల్లో మట్టి తోలకాలు చేస్తున్న అక్రమార్కులు కందకాలు పెట్టడం వల్ల వర్షాకాలంలో పశువులు చెరువులలోకి దిగిన అనేక మంది మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి.
- నిబంధనలకు విరుద్ధంగా లారీలతో ఇతర ప్రాంతాలకు మట్టి తోలకాలు చేపడితే గ్రామస్థులు అక్రమ మట్టి తోలకాలపై వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. లేదా గ్రామ రెవెన్యూ అధికారి,తహసీల్దార్, ఆర్డీవో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

ఆగిరిపల్లిలో పారిశుధ్య పనులు



ఆగిరిపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో ని అన్ని గ్రామాలలో డ్రెయి నేజీ వ్యవస్థను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో బి.ఆనంద్ బాబు తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచు కుని నీటి నిలువ ఉండకుండా డ్రెయినేజీ వ్యవస్థను శుభ్రంగా ఉంచి, ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలని తెలిపారు. అందులో భాగంగా ఆగిరిపల్లి గ్రామంలో సర్పంచ్ చౌటపల్లి లక్ష్మీ విక్టర్‌బాబు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. హైస్కూల్ రోడ్, కోలలు బజార్‌లో మురుగు కాలువలలో చెత్తను, కాలువలలో పేరుకుపోయిన మురుగు మట్టిని తీసి శుభ్రపరిచారు.

వృక్షం కాదు.. విద్యుత్ స్తంభం!



చాట్రాయి, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం కోనేరు రంగారావు కాలనీలో విద్యుత్ స్తంభానికి పచ్చటి తీగలు అల్లుకొని ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ స్తంభానికి సమీపంలోని ఇంటిలోనే మంగళవారం రాత్రి విద్యుత్‌ఘాతానికి గురై ఇంటర్ విద్యార్థి పరసా మధుకిరణ్ మృతి చెందాడు. స్తంభానికి తీగలు అల్లుకున్నా విద్యుత్ ఉద్యోగులు పట్టించుకోకపోవటం నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యోగాపై అవగాహన ర్యాలీ



చాట్రాయి, మే 29(ఆంధ్రజ్యోతి): యోగాను నిత్యం అభ్యసిస్తే మానసిక ప్రశాంతత, ఆరోగ్యం మన సొంతం అవుతాయని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. చాట్రాయిలో గురువారం యోగాపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ యోగాంధ్ర-2025లో పౌరులందరూ రిజిస్టర్ చేసుకోవాలని, మారుతున్న కాలంలో ఉరుకుల పరుగుల జీవితాలలో ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడి గురి అవుతూ అనేక ఆనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని చెప్పారు. యోగాను సాధన చేస్తే శక్తి, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో విష్ణు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సచివాలయ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిడ్జి పక్కన అగాధం



చాట్రాయి, మే 29(ఆంధ్రజ్యోతి): విస్సన్నపేట-వెలగలపల్లి రహదారి(వివిరోడ్డు)లో మంకొల్లు గ్రామ పరిధిలో టీఆర్‌పీ రెగ్యులేటర్ వద్ద రోడ్డు వంతెన పక్కనే ప్రమాదకర అగాధం ఏర్పడింది. ఈ అగాధం వర్షాలకు రోజు రోజుకు పెద్దది అయ్యి రోడ్డు అంచుకు వస్తున్నది. ఇక్కడ ఏదైనా వాహనం ఎదురు వచ్చి పక్కకు తప్పుకుంటే ప్రమాదం జరుగుతుంది. 30 అడుగుల లోతులో తమ్మిలేరులో పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఇక్కడ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు, వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి అడాదం పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్‌లు వితరణ



మునునూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): రమణక్కపేటలో అంగన్‌వాడీ కేంద్రానికి జనసైనికుడు కమటంశెట్టి రాజా సహకారంతో సీలింగ్ ఫ్యాన్‌లు సమకూర్చారు. జనసేన సెంట్రల్ ఆంధ్ర కమిటీ సభ్యులు పాశం నాగబాబు ఈ ఫ్యాన్‌లను అంగన్‌వాడీ టీచర్‌కు గురువారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగు బుజ్జి, ఉప్పే మోహన్‌కృష్ణ, జనసేన మండల ప్రధాన కార్యదర్శి వేటా త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

గోపవరంలో ఎన్టీఆర్ జయంతి



కేక్ కట్ చేస్తున్న టీడీపీ యువనేత గణేష్ తదితర నాయకులు

మునునూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ 102 వ జయంతి వేడుకలు గోప వరం ఎస్సీకాలనీలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు గణేష్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కాలనీలో ఎన్టీఆర్ విగ్రహానికి గణేష్, ఉపాధ్యక్షులు సాయిల వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యాదర్శి కర్ర ఏసుపాదంలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాణసంచా కాల్చి, కేక్‌ను కట్ చేశారు.అనంతరం అన్నసమారాధన కార్యాక్రమాన్ని నిర్వహించారు.

న్యూస్ పేపర్లపై అవగాహన



డిబేట్‌లో మాట్లాడుతున్న బాలిక

కలిదిండి, మే 29 (ఆంధ్రజ్యోతి): కలిదిండి, కోరుకొల్లు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. గురువారం డిబేటింగ్, చదవటం మాకిష్టం నిర్వహించారు. జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, న్యూస్ పేపర్లపై అవగాహన కల్పించారు. కలిదిండి, కోరుకొల్లు గ్రంథాలయాధికారులు జె.రమేష్ బాబు, రాఘవులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు



ముదినేపల్లి గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ముదినేపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గురువారం ముదినేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రకృతి సౌందర్యం, జాతీయ నాయకుల చిత్రాలను గీశారు. కొంతమంది విద్యార్థులు వృక్షాలు - వాటి ప్రయోజనాలను అద్దం పట్టే విధంగా చిత్రాలను గీశారు. సుమారు 30 మంది విద్యార్థులు చిత్ర లేఖనం పోటీల్లో పాల్గొన్నారు.

చెరువుల్లో రొయ్యల వ్యర్థాలను నిషేధించాలి

కలిదిండి, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉప్పుటేరు తీర గ్రామాల్లో పండుగప్ప చెరువుల్లో రొయ్యల వ్యర్థాలు వేయటాన్ని నిషేధించాలని రొయ్యల సాగు రైతులు మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. కొండంగి, పల్లిపాలెం, మట్టగుంట, పెదలంక, శాంతినగరం, భాస్కరావుపేట, సంతోషపురం గ్రామాల్లో పండుగప్పలకు ఆహారంగా రొయ్యల తలకాలయను వేయటంతో నీరు కలుషితమవ్వటంతోపాటు చుట్టుపక్కల చెరువుల్లో రొయ్యలకు వైరస్ సోకి చనిపోవటంతో నష్టపోతున్నారని పేర్కొన్నారు. భీమవరం పరిసర ప్రాంతాల నుంచి వ్యానులపై కొందరు రొయ్యల వ్యర్థాలను తీసుకొచ్చి కిలో రూ.10 నుంచి 15 చొప్పున పండుగప్ప సాగు రైతులకు విక్రయిస్తున్నారని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రొయ్యల వ్యర్థాలను విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సోమేశ్వరం కాలనీ ప్రజలు

కైకలూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్ ఫ్లైఓవర్ నిర్మాణంతో శ్మశాన వాటిక ప్రజలకు అందుబాటులో లేకుండా పోయిందని కొత్తగా మరో శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలని తహసీల్దార్ ఎండీ ఇబ్రహీంకు వినతి పత్రం అందజేశారు. గురువారం కైకలూరు మండలం ఆలపాడు శివారు సోమేశ్వరం కాలనీకి చెందిన గ్రామస్థులు శ్మశానవాటికకు స్థలాన్ని కేటా యించాలని కోరారు. 1983లో సోమేశ్వరం కాలనీ నిర్మాణం జరిగిందని అయితే శ్మశానవాటికను కేటాయించలేదని ఎక్కడో దూరంగా ఉన్న శ్మశానవాటికలో ఖననం చేస్తున్నామన్నారు. ప్రస్తుతం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం చేప ట్టారని వీరందరికి శ్మశానవాటిక అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని, అంతా ఎస్సీ గ్రామం కావడం ఎవరైనా చనిపోతే ఖర్చులు కూడా భరించలేని పరిస్థితిలో ఉన్నామని గృహాలకు దగ్గరలో శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలని కోరారు.

పీఏసీఎస్ ఉద్యోగుల బదిలీలపై కసరత్తు

ముదినేపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి) : సహకారశాఖలో అధికారులు, ఇతర కేటగిరీల ఉద్యోగులు బదిలీలు చేపట్టిన నేపథ్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగులను కూడా బదిలీలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఐదు సంవత్సరాలుగా సహకారశాఖ ఉన్నతాధికారుల పరిశీలనలో ఉన్న పీఏసీఎస్ ఉద్యోగుల బదిలీల అంశం కార్యరూపం దాల్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అయితే పీఏసీఎస్‌ల సీఈఓలు, ఇతర సిబ్బందిని సహకార బ్యాంకు బ్రాంచ్ స్థాయిలో బదిలీ చేయాలా లేక డివిజనల్ స్థాయిలో బదిలీలు నిర్వహించాలా అన్నది త్వరలో తేలనున్నట్లు తెలిసింది. సహకార సంఘాల కార్యకలాపాలను ఆన్‌లైన్ చేయడం కూడా పూర్తయినందున ఉద్యోగుల బదిలీలు నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. 2019కి ముందు సంఘాల్లో చేరి సర్వీస్ రిజిష్టర్లు కలిగి ఉన్న ఉద్యోగులకు బదిలీలు తప్పవని తెలుస్తున్నది. కైకలూరు నియోజకవర్గంలో సుమారు 70 మంది పీఏసీఎస్ ఉద్యోగులకు సహకార శాఖ మార్గదర్శక సూత్రాల ప్రకారం స్థాన చలనం కలిగే అవకాశం కనిపిస్తుంది. ఒక్క ముదినేపల్లి మండలంలోనే 20 మంది ఉద్యోగులు బదిలీ అయ్యే అవకాశాలున్నాయి. పీఏసీఎస్‌ల వ్యాపార టర్నోవర్‌ను బట్టి సంఘ సీఈవోలను బదిలీ చేస్తారు. ఇతర ఉద్యోగులను కేటగిరితో సంబంధం లేకుండానే బదిలీ చేసే అవకాశాలున్నాయి. పీఏసీఎస్‌ల వారీగా ఉద్యోగుల సీనియార్టీని, పే స్కేలు ఇతర ఆర్థికపరమైన అంశాలు, సంఘాల ఆర్థిక స్థితిగతుల సమాచారాన్ని అధికారులు ఇప్పటికే సేకరించినట్లు తెలిసింది. అయితే పీఏసీఎస్ ఉద్యోగుల బదిలీలకు అంగీకారం తెలిపిన యూనియన్లు కొన్ని డిమాండ్లను కూడా అధికారుల ముందుంచారు. ఉద్యోగుల బదిలీల వ్యవహారం పూర్తిగా జిల్లా స్థాయి కమిటీ ద్వారా జరగాలని, జీతభత్యాల అకౌంట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నిర్వహించాలని, ఉద్యోగులకు జిల్లా, డివిజన్, సహకార బ్యాంకు బ్రాంచి స్థాయిల్లో బదిలీలు కోరుకునే ఆప్షన్లు జిల్లా స్థాయి కమిటీ కల్పించాలని పీఏసీఎస్ సీఈవో, ఇతర ఉద్యోగులను చేర్చుకునేందుకు బదిలీ అయిన సంఘంలో చేర్చుకునేందుకు అభ్యంతరాలు ఉండకూడదని ఉద్యోగుల అసోసియేషన్లు కోరుతున్న నేపథ్యంలో ఎటు వంటి ఇబ్బందులను ఎదురు కాకుండా ప్రస్తుతం అధికారిక పిఐసిలు ఉన్న సమయంలోనే బదిలీలు నిర్వహించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.